ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY
5
జయశంకర్
భూపాలపల్లి
బుధవారం 22 జనవరి 2025

- ఉమ్మడి వరంగల్, నల్లగొండ, ఖమ్మం జిల్లాల పరిధిలో ఎన్నికలు
- మార్చి 29వ తేదీతో పూర్తికానున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి పదవీకాలం
- ఫిబ్రవరి మూడోవారంలో నోటిఫికేషన్ వచ్చే అవకాశం
- ఇప్పటికే పోటీ చేసే అభ్యర్థులను ప్రకటిస్తున్న ఉపాధ్యాయ సంఘాలు
- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో అభ్యర్థిని నిలిపిన బీజేపీ
- ఇండిపెండెంట్‌గా అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు పలువురి సిద్ధం
- మూడు ఉమ్మడి జిల్లాల పరిధిలో 25వేల మంది టీచర్ ఓటర్లు



గురు పోరు!

వివరాలు : 7లో..

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సమాయత్తం

ఎమ్మెల్సీ ఎన్నికలకు టీచర్లు సిద్ధమవుతున్నారు. వచ్చే నెలలో జరగనున్న తెలంగాణ శాసనమండలి ఉపాధ్యాయ పోరుకు అభ్యర్థులు కసరత్తు మొదలుపెట్టారు. ఉపాధ్యాయ సంఘాల తరపున కొందరు అభ్యర్థులు బరిలో దిగుతుండగా, పార్టీల మద్దతుతో మరికొందరు పోటీకి సిద్ధమవుతున్నారు. ఇక మరికొందరు స్వతంత్రంగా బరిలో దిగేందుకు తయారవుతున్నారు. అయితే గత 2019 ఎన్నికల్లో టీజీ యూటీఎఫ్ తరపున పోటీ చేసి ఎమ్మెల్సీగా విజయం సాధించిన నర్సిరెడ్డి పదవీకాలం ఫిబ్రవరి 29తో ముగియనుంది. దీంతో ఈలోగానే ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల కమిషన్ ప్రణాళికలు రూపొందిస్తోంది. ఈ క్రమంలో వచ్చే నెల మూడో లేదా నాలుగో వారంలో టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలు జరపాలని యోచిస్తోంది. ఈ క్రమంలో ఎన్నికల బరిలో నిలిచేందుకు ఉవ్విళ్లూరుతున్న అభ్యర్థులు ఏర్పాట్లు ముమ్మరం చేసుకుంటున్నారు. ప్రస్తుత ఎమ్మెల్సీ నర్సిరెడ్డి మళ్లీ బరిలో నిలవనుండగా, గత ఎన్నికల్లో పీఆర్‌టీయూ నుంచి పోటీ చేసి ఓడిపోయిన పూల రవీందర్.. టీచర్స్ జాక్ తరపున బరిలో దిగుతున్నారు. అలాగే పీఆర్‌టీయూ నుంచి ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పింగిళి శ్రీపాల్‌రెడ్డి బరిలో దిగుతున్నారు. ఇక బీజేపీ నుంచి మాజీ పీఆర్‌టీయూ నేత సరోత్తంరెడ్డి తపస్ మద్దతుతో బీజేపీ అభ్యర్థి బరిలో దిగుతున్నారు. వీరితో పాటు మాజీ కూడా చైర్మన్ సుందర్‌రాజ్ యాదవ్ స్వతంత్రంగా అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. అలాగే మరో సంఘం నుంచి హర్షవర్ధన్‌రెడ్డి, సీపీఎస్ సంఘం నుంచి వెంకటస్వామి లాంటి నేతలు బరిలో ఉండడంతో పోటీ ఆసక్తికరంగా మారింది.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

నేటి నుంచి జేఈఈ మెయిన్స్ పరీక్షలు

- 5 కేంద్రాల్లో మూడు రోజులపాటు నిర్వహణ
- హాజరుకానున్న 7,542 మంది విద్యార్థులు

వరంగల్ ఎడ్యుకేషన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్స్ పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. వరంగల్, హనుమకొండ జిల్లాల కేంద్రాల్లో ఏర్పాటు చేసిన 5 ఆన్‌లైన్ పరీక్ష కేంద్రాల్లో ఈ పరీక్షను మూడు రోజుల పాటు కంప్యూటర్ బేస్డ్ టెస్ట్(సీబీటీ) పద్ధతిలో ఆన్‌లైన్‌లో నిర్వహించనున్నారు. 22, 23, 24 తేదీల్లో నిర్వహించే పరీక్షకు 7,542 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. చింతగట్టులోని నోబుల్ టెక్నాలజీస్, బీమారంలోని మోక్షిత్ కంప్యూటర్స్, ఎర్రగట్టు గుట్ట వద్దగల అయాన్ డిజిటల్ జోన్, పద్మాక్షిరోడ్‌లోని జయ ఇంజనీరింగ్ కాలేజ్, బొల్లికుంటలోని వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటుచేసిన పరీక్ష కేంద్రాల్లో పరీక్ష జరుగనుంది. పరీక్ష మొదటి సెషన్ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, రెండో సెషన్ మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పరీక్ష జరుగనుంది. కాగా, పరీక్ష కేంద్రాల వద్దకు విద్యార్థులు రెండు గంటల ముందుగానే చేరుకోవాల్సి ఉంటుంది. పరీక్ష కేంద్రాల్లోకి విద్యార్థులను రెండు గంటల ముందు నుంచే అనుమతిస్తారు. పరీక్ష ప్రారంభానికి అరగంట ముందే పరీక్ష కేంద్రంలోకి అనుమతించరు. అన్ని పరీక్ష కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పరీక్ష సిటీ కోఆర్డినేటర్ కె.శ్రీలతరెడ్డి చెప్పారు. విద్యార్థులు నిర్ధేశిత సమయంలో పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని ఆమె కోరారు.

ఆందోళనలు.. వాగ్వాదాలు

- ప్రజాపాలనలో ఆగ్రహావేశాలు
- గ్రామసభల్లో అధికారులను నిలదీసిన జనం
- సంక్షేమ పథకాల జాబితాలో పేర్లు లేకపోవడంతో నిలదీత
- అవకతవకలు జరిగాయని ఆరోపణలు

భూపాలపల్లిటౌన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మంగళవారం ప్రారంభమైన ప్రజాపాలన గ్రామ సభలు పలుచోట్ల ఆందోళనలు, వాగ్వాదాల నడుమ కొనసాగాయి. సంక్షేమ పథకాల లబ్ధిదారుల ఎంపికలో అవకతవకలు చోటుచేసుకున్నాయని అధికారులను నిలదీశారు. అర్హులకు కాదని, అనర్హులకు లబ్ధిచేకూరేలా అధికారులు జాబితాలు రూపొందించారని నిరసనలకు దిగారు. సంక్షేమ పథకాల్లో రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసాను అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల సర్వే నిర్వహించింది. ఇందులో భాగంగా జిల్లాలో జరిగిన గ్రామసభల్లో కొన్ని చోట్ల అధికారులకు చేదు అనుభవం ఎదురైంది. అర్హులైనప్పటికీ తమ పేరు జాబితాలో ఎందుకు లేదని గ్రామస్థులు నిలదీశారు. భూమిలేని వారి కుటుంబాలకు మాత్రమే రైతుభరోసా పథకం వర్తింపజేయాల్సి ఉండగా భూమి ఉన్న వారి కుటుంబానికి ఎలా మంజూరు చేస్తారని మహాముత్తారం మండలంలోని కొర్లకుంట గ్రామ సభలో పలువురు నిలదీశారు. ఆందోళన తీవ్రరూపం దాల్చడంతో పోలీసులు అక్కడికి చేరుకుని సభను సాఫీగా నడిపించారు. చిట్యాల మండల కేంద్రంలో జరిగిన జరిగిన గ్రామసభలో అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మి పాల్గొనగా సమక్షంలో పలువురు ఆందోళనకు దిగారు. డబుల్ బెడ్‌రూం ఇళ్ల కేటాయింపులో తమకు అన్యాయం జరిగిందని నిరసన తెలిపారు. దరఖాస్తు చేసిన అర్హుల పేర్లు రాలేదని మండిపడ్డారు. అలాగే రేషన్‌కార్డుల కోసం నాలుగైదు సార్లు దరఖాస్తు చేసు కున్నా జాబితాలో పేరు రాలేదని పలువురు అధికారులను నిలదీశారు. కాటారం మండలంలో జరిగిన గ్రామ సభలో సబ్‌కలెక్టర్ మయాంక్‌సింగ్, డీఆర్‌డీవో నరేష్ పాల్గొన్నారు. కాటారం, రేగులగూడెంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొని అధికారులను నిలదీశారు. ఏ ప్రాతిపదికన అర్హుల జాబితాను ఎంపిక చేశారని ప్రశ్నించారు. ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డుల జాబితాలో తప్పులు దొర్లాయని కొందరు, పేర్లు రాలేదని మరికొందరు నిలదీశారు. గోరికొత్తపల్లి మండలంలోని వెంకటేశ్వర్లపల్లిలో అర్హత లేని వారిని ఆత్మీయ భరోసాకు ఎంపిక చేశారని, ఎస్సీ, ఎస్టీలలో అర్హులైన వారిని ఎంపిక చేయలేదని గ్రామస్థులు ఆందోళనకు దిగారు. నిజాంపల్లి గ్రామంలో అర్హులైన వారిని ఆత్మీయ భరోసాకు ఎందుకు ఎంపిక చేయలేదని అధికారులను ప్రజలు ప్రశ్నించారు. రేగొండ మండలంలోని బాగిర్తిపేట గ్రామంలో జరిగిన గ్రామ సభలో ఇద్దరు కాంగ్రెస్ కార్యకర్తలు గొడవపడ్డారు. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, కలెక్టర్ రాహుల్‌శర్మ పాల్గొన్న సభలు ప్రశాంతంగా నడిపించారు.



కాటారంలో అధికారులను నిలదీస్తున్న గ్రామస్థులు

పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

చిట్యాల, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. పార్టీలకు అతీతంగా అర్హులైన వారికి లబ్ధి చేకూరుస్తున్నామని తెలిపారు. మండలంలోని జూకల్లు, చల్లగరిగలో మంగళవారం జరిగిన ప్రజాపాలన గ్రామ సభలకు కలెక్టర్ రాహుల్‌శర్మతో కలిసి ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈసందర్భంగా మాట్లాడుతూ సాగు భూములకు మాత్రమే రైతు భరోసా అందిస్తామన్నారు. నాలుగేళ్లల్లో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇస్తామని స్పష్టం చేశారు. ఎన్నికల హామీల్లో భాగంగా భూమిలేని నిరుపేదలకు సంవత్సరానికి రూ.12వేలు అందజేస్తామన్నారు. గత ప్రభుత్వం 10 ఏళ్లలో ఒక్క రేషన్‌కార్డు కూడా మంజూరు చేయలేదని గుర్తు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన ప్రతి కుటుంబానికీ రేషన్‌కార్డు మంజూరు చేసి సన్న బియ్యం పంపిణీ చేస్తుందన్నారు. భూభారతి చట్టంతో రాష్ట్ర వ్యాప్తంగా భూ యాజమానులకు హక్కు వస్తుందని, గత ప్రభుత్వం తప్పిదాలను సరిచేస్తామని తెలిపారు.



చల్లగరిగ గ్రామసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జీఎస్సార్

దరఖాస్తుల స్వీకరణ నిరంతర ప్రక్రియ: కలెక్టర్ రాహుల్‌శర్మ

ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దరఖాస్తుల స్వీకరణ నిరంతర ప్రక్రియ అని కలెక్టర్ రాహుల్‌శర్మ అన్నారు. నాలుగు పథకాలకు జాబితాలో పేరులేని వారు గ్రామ సభలో దరకాస్తు చేసుకోవాలని, వీలు కాని వారు మండల పరిషత్ కార్యాలయంలోని ప్రజాపాలన సేవాకేంద్రంలో ధరకాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ప్రజలు ఆందోళన చెందొద్దని సూచించారు. ఈకార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి చిన్నయ్య, ఏఎంసీ చైర్‌పర్సన్ గుమ్మడి శ్రీదేవి, తహసీల్దార్ హేమ, ఎంపీడీవో జయశ్రీ, ఎంపీవో రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మొదటి రోజు ప్రజాపాలన విజయవంతం

భూపాలపల్లి కలెక్టరేట్ (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మొదటిరోజు ప్రజాపాలన గ్రామసభలు విజయవంతమయ్యాయని కలెక్టర్ రాహుల్‌శర్మ అన్నారు. మండల ప్రత్యేక అధికారులు, వ్యవసాయ, రెవెన్యూ, పంచాయతీరాజ్ అధికారులతో ఆయన మంగళవారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న నాలుగు సంక్షేమ పథకాలకు లబ్ధిదారుల ఎంపికకు మొదటి రోజు జిల్లాలో చేపట్టిన 72 గ్రామ సభలు విజయవంతం కావడంపై అధికారయంత్రాంగం, పాల్గొన్న ప్రజల్ని అభినందించారు. ఇదే స్ఫూర్తితో మూడు రోజులు గ్రామసభలను విజయవంతం చేయాలన్నారు. అర్హులైన వారి నుంచి దరఖాస్తు స్వీకరణకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటుచేయాలన్నారు. గ్రామ సభల్లో ప్రజల సమక్షంలో అర్హుల జాబితాను సిద్ధం చేయాలన్నారు. ఈకార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, మండల, గ్రామ ప్రత్యేక అధికారులు, డీపీవో విజయ్ భాస్కర్, డీర్డీవో నరేష్, డీఎస్‌వో శ్రీనాథ్, త హసీల్దార్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

24న మల్లంపల్లి మండల ఆవిర్భావం

- కార్యాలయాల ఏర్పాటుకు సన్నాహం
- తహసీల్, ఎంపీడీవోలకు భవనాల ఎంపిక
- ఆయుర్వేద ఆస్పత్రి భవనంలో పోలీస్ స్టేషన్
- హాజరుకానున్న మంత్రులు సీతక్క, పొంగులేటి



వివరాలు 6వ పేజిలో..

మేడారంలో కొనసాగుతున్న మొక్కులు

- 10 వేల మందికి పైగా వచ్చిన భక్తులు

తాడ్వాయి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో వనదేవతలకు ముందస్తు మొక్కులు మంగళవారం కొనసాగాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు సమ్మక్క సారలమ్మ పగిడిద్దరాజు గోవిందరాజుల గద్దెలను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. సుమారు 10వేలకు పైగా తరలివచ్చిన భక్తులు ప్రైవేటు వాహనాల్లో మేడారం చేరుకున్నారు. ముందుగా జంపన్నవాగులో పుణ్యస్నానాలు చేశారు. పూలు, పండ్లు, పసుపు, కుంకుమ చీరె, సారె, కొబ్బరికాయలు, బెల్లం(బంగారం), యాట మొక్కులు సమర్పించుకున్నారు. తల్లులకు పూజలు చేసి కోరికలు తీరాలని వేడుకున్నారు.



వనదేవతలనుదర్శించుకుంటున్న భక్తులు

రోడ్డు ప్రమాదంలో పంచాయతీ కార్యదర్శి మృతి



చంద్రారెడ్డి (ఫైల్)

రేగొండ, జనవరి 21(ఆంధ్రజ్యోతి) : మండలంలోని నారాయణపురం పంచాయతీ కార్యదర్శి చంద్రారెడ్డి (50) రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. తిరుమలగిరి వాసి అయిన ఆయన వ్యక్తిగత పనుల నిమిత్తం రేగొండకు బైక్‌పై వచ్చి తిరిగి వెళ్తున్న క్రమంలో పరకాల-భూపాలపల్లి రహదారిపై ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొంది. దీంతో చంద్రారెడ్డి తీవ్రంగా గాయపడ్డారు. ఆయన్ను వెంటనే ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందారు. చంద్రారెడ్డికి భార్య దేవేంద్ర, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

సింగరేణిలో క్లర్కుల కొరత

- 189 మంది ఉండాల్సి ఉండగా విధుల్లో ఉన్నది133 మంది మాత్రమే..
- ఖాళీగానే 56 పోస్టులు
- కార్యాలయాల్లో సకాలంలో సాగని పనులు

కాకతీయఖని, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): సింగరేణి భూపాలపల్లి ఏరియాలోని ఆయా డిపార్ట్‌మెంట్లలో క్లర్కుల కొరత తీవ్రంగా ఉంది. దీంతో పలు కార్యాలయాల్లో పనులకు తీవ్ర జాప్యమవుతోంది. ఉద్యోగుల అపాయింట్‌మెంట్స్ మొదలుకొని పదవీ విరమణ పొందేవరకు క్లర్కుల పాత్ర కీలకం. వీరి సంఖ్య తక్కువ ఉండటంతో ఏ పని కూడా సకాలంలో జరగడం లేదని ఉద్యోగులు అంటున్నారు. సింగరేణి భూపాలపల్లి ఏరియాలో నాలుగు అండర్‌గ్రౌండ్ గనులు, రెండు ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టులతోపాటు వివిధ గనులు, డిపార్టు మెంట్లు ఉన్నాయి. వీటిలో సుమారు 5,500 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. వీరి జీతభత్యాలు, టర్మినల్ బెనిఫిట్స్, మస్టర్స్, సర్వీస్ రికార్డులు తదితర పనులకు ఏరియాలో 189 మంది క్లర్కులు విధులు నిర్వర్తించాల్సి ఉండగా ప్రస్తుతం 133 మంది మాత్రమే పనిచేస్తున్నారు. ప్రధానంగా జీఎం కార్యాలయానికి గుండెకాయ లాంటి పర్సనల్ డిపార్ట్‌మెంట్‌లోనూ ఈ కొరత ఉంది. ఇక్కడ ఉద్యోగుల డిపెండెట్ ఎంప్లాయిమెంట్, సీఎంపీఎఫ్, గ్రాట్యూటీ, పెన్షన్, క్వాటర్స్ అలాట్ మెంట్ తదితర పనులు చేయాల్సి ఉంటుంది. అలాంటి విభాగంలో 12 మంది క్లర్కులు పని చేయాల్సి ఉండగా 10 మంది మాత్రమే ఉన్నారు. గనుల వద్ద అనుకున్న స్థాయిలో క్లరికల్ సిబ్బంది లేకపోవడంతో జనరల్ మజ్దూర్లతో పని కానిచ్చేస్తున్నట్లు తెలుస్తోంది. క్లర్కుల కొరత కారణంగా ఆయా పనుల్లో జాప్యం కావడంతో కార్మికులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఉన్న వారిపైనే అధిక ఒత్తిడి

భూపాలపల్లి ఏరియాలోని అండర్‌గ్రౌండ్ గనులు, ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టుల్లో 112 మంది క్లర్కులు పనిచేయాల్సి ఉందని, జీఎం కార్యాలయం, ఎస్టేట్స్, ఫైనాన్స్, పర్సనల్, క్వాలిటీ, మెడికల్, ఏరియా స్టోర్స్, గెస్ట్‌హౌజ్ తదితర డిపార్టుమెంట్లలో 77 మంది పనిచేయాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు. మొత్తం 189 మంది పనిచేయాల్సి ఉండగా ప్రస్తుతం 133 మంది పనులు చేయాల్సి వస్తోందని, దీంతో మిగిలిన 56 మంది క్లర్కుల పని తామే చేయాల్సి వస్తుందని పలువురు క్లర్కులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సింగరేణి యాజమాన్యం ఈ ఖాళీలను భర్తీ చేయాలని కోరుతున్నారు.



పాదయాత్ర చేస్తున్న సీఐటీయూ నేతలు, ఆశావర్కర్లు

ఆశావర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం అందించాలి

కురవి నుంచి 10 కిలో మీటర్ల పాదయాత్ర

మహబూబాబాద్ టౌన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : వైద్య శాఖలో చాలీ చాలనీ వేతనాలతో పని చేస్తున్న ఆశా వర్కర్లకు నెలకు ఫిక్స్‌డ్ వేతనం రూ. 18 వేలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కుంట ఉపేందర్, తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి వడ్లకొండ ఉపేంద్ర అన్నారు. సదరు డిమాండ్‌తో సీఐటీయూ అనుబంధ తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ ఆధ్యర్యంలో మంగళవారం కురవి మండల కేంద్రం నుంచి కలెక్టరేట్ వరకు 10 కిలోమీటర్ల పాదయాత్ర చేసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. శాసనసభ బడ్జెట్ సమావేశాల్లో ఆశాలకు ఫిక్స్‌డ్ వేతనం రూ.18 వేలు అమలు చేయాలని లేకుంటే ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఏఎన్ఎం శిక్షణ పూర్తి చేసిన ఆశావర్కర్లకు పదోన్నతి కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ప్రతీ ఆదివారం, పండుగల రోజున సెలవు ఇవ్వాలని, వేతనంతో కూడిన 20 రోజులు క్యాజువల్, ఆరు నెలలు మెడికల్ సెలవులు కల్పించాలని కోరారు. ప్రభుత్వం వెంటనే స్పందించి తమ డిమాండ్లను పరిష్కరించాలని, ఫిక్స్‌డ్ వేతనం చెల్లించేంత వరకు పోరు ఆగదని స్పష్టం చేశారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ వీరబ్రహ్మచారికి వినతి పత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో సీఐటీ యూ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజు, పోతుగంటి మల్లయ్య, కుమ్మరికుంట్ల నాగన్న, ఆశవర్కర్స్ యూనియన్ నేతలు సుజిత, కాళేశ్వరి, నిర్మల, రమ, సుల్తానా, హేమలత, కరుణ, హసీనా, జ్యోతి, విజయ, శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

ఒకరిపై కేసు నమోదు

డోర్నకల్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గొల్లచర్ల క్రాస్‌రోడ్డు వద్ద ఓ మెకానిక్ షాపులో బాలుడిని పనిలో పెట్టుకున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు డోర్నకల్ సీఐ రాజేష్ రాజేష్ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. డోర్నకల్ మండలం గొల్లచర్ల క్రాస్‌రోడ్డు వద్ద ఓ మెకానిక్ షాపు నిర్వహిస్తున్న బాష్పంగు సాగర్ వద్ద బాలుడు పనిచేస్తున్నాడు. విషయం తెలుసుకున్న మహబూబాబాద్ చైల్డ్‌లైన్ సిబ్బంది గొల్లచర్లకు చేరుకుని సదరు బాలుడిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. అనంతరం బాలుడిని పనిలో పెట్టుకున్న బాష్పంగు సాగర్‌పై చైల్డ్‌లైన్ సిబ్బంది ఇచ్చిన ఫిర్యాదు మేరకు డోర్నకల్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ... బడి ఈడు పిల్లలను ఎవరైన పనిలో పెట్టుకుంటే వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అనంతరం బాలుడిని చైల్డ్‌లైన్ సిబ్బందికి అప్పగించినట్లు తెలిపారు.

ఉచిత కుట్టు మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన క్రిస్టియన్ మహిళలు ఉచిత గృహ కుట్టు మిషన్లకు అర్హులైన అభ్యర్థులు ఈ నెల 25లోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి బి. శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం తెలంగాణ క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ (టీజీసీఎంఎఫ్‌సీ) ఆధ్వర్యంలో ఇందిరమ్మ మహిళా శక్తి పథకం కింద వెబ్‌సైట్ tgobmms.cgg.gov.inలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. బాప్తిస్మం, బీసీసీ సర్టిఫికెట్ కలిగి ఉండాలని, తెల్ల రేషన్‌కార్డు/ఆహారభద్రత కార్డు లేదా రెండు అందుబాటులో లేకుంటే ఆదాయ ధ్రువీకరణ పత్రం ఉండాలన్నారు. గ్రామీణ ప్రాంత అభ్యర్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ. 1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.2 లక్షల వరకు ఉండాలన్నారు. దరఖాస్తు దారు కనీస విద్యార్హత 5వ తరగతి ఉండాలని, వయస్సు 21 నుంచి 55 ఏళ్ల మద్య ఉండాలన్నారు. (వయసు రుజువుకు ఆధార్ లేదా ఓటరు కార్డు ఉండాలన్నారు). ఒక కుటుంబానికి ఒక యంత్రం మాత్రమే ఇవ్వబడుతుం దని, శిక్షణ ధ్రువీకరణ పత్రం సమర్పించాలన్నారు. దరఖాస్తుదారులు గత ఐదేళ్లలో టీజీసీఎంఎఫ్‌సీ నుంచి ఆర్థిక సాయం పొందలేదని స్వీయ ప్రకటన ఇవ్వాలన్నారు. ఇతర వివరాలకు 9182540680, 9573769507లను సంప్రదించాలన్నారు.

24న మల్లంపల్లి

మండల ఆవిర్భావం

కార్యాలయాల ఏర్పాటుకు సన్నాహం

- తహసీల్, ఎంపీడీవోలకు భవనాల ఎంపిక
- ఆయుర్వేద ఆస్పత్రి భవనంలో పోలీస్ స్టేషన్
- హాజరు కానున్న మంత్రులు సీతక్క, పొంగులేటి

ములుగు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మల్లంపల్లి మండల ఏర్పాటుకు ఏర్పాట్లు చకచకా జరుగుతున్నాయి. ములుగు మండలంలో అంతర్భాగంగా ఉన్న మల్లంపల్లి, రాంచంద్రాపురం రెవెన్యూ గ్రామాల పరిధిలోని పది గ్రామపంచాయతీలతో నూతన మండలాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు నవంబరు 28న రాష్ట్ర ప్రభుత్వం తుది గెజిట్ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఈక్రమంలో తాత్కాలిక కార్యాలయాల ఏర్పాటుకు జిల్లా అధికారులు చర్యలు ముమ్మరం చేశారు. భవిష్యత్తులో పక్కా భవనాల నిర్మాణం కోసం అవసరమైన ప్రభుత్వ స్థలాలను గుర్తించారు. పలుమార్లు క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి తుది నిర్ణయానికి వచ్చారు. గ్రామ పంచాయతీ కార్యాలయ భవనంలో ఎంపీడీవో, ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం భవనంలో తహసీల్దార్ కార్యాలయాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. తహసీల్ ఆఫీసు కోసం అవసరమైన ఫర్నిచర్‌ను ఇప్పటికే సమకూర్చారు. స్థానిక సంస్థల ఎన్నికలు పూర్తయిన తర్వాత మండల ప్రజా పరిషత్ కార్యకలాపాలు ప్రారంభం కానున్నాయి. జాతీయ రహదారిపై ఉన్న మల్లంపల్లి, చుట్టుపక్కల గ్రామాలలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం ప్రాధాన్యతాంశంగా పోలీస్ స్టేషన్‌ను కూడా ఏర్పాటు చేయనున్నారు. ఆయుర్వేద ఆస్పత్రి భవనాన్ని స్టేషన్ కోసం ఎంపిక చేశారు. తొలుత ఈ మూడు కార్యాలయాలను ప్రారంభించడం ద్వారా మల్లంపల్లి మండలాన్ని మనగడలోకి తీసుకువచ్చేందుకు కార్యాచరణ దాదాపు పూర్తయ్యింది. ఆయా కార్యాలయాల పరిసరాలను చదును చేశారు. కాగా, సంక్రాంతి పండగ ముగిసిన తర్వాత ఈ నెల 16న మండలాన్ని ప్రారంభించాలని అధికార యంత్రాంగం భావించింది.

వీలు కాకపోవడంతో ఈనెల 24న ముహూర్తం ఖరారు చేశారు. రాష్ట్ర రెవెన్యూ శాఖమంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేయించనున్నారు. మంత్రుల షెడ్యూలు ఖరారైనట్లు మండల సాధన సమితి అధ్యక్షుడు గోల్కొండ రాజు తెలిపారు. సుదీర్ఘ పోరాటం తర్వాత సాధించుకున్న మల్లంపల్లి మండలాన్ని ప్రజల హర్షధ్వానాలు, సంబరాల నడుమ ప్రారంభించుకుంటామని తెలిపారు.



మల్లంపల్లి వ్యూ


ఎంపీడీవో కార్యాలయం కోసం ఏర్పాటు చేయనున్న పంచాయతీ భవనం

తహసీల్దార్ కార్యాలయం ఏర్పాటు చేసే సహకార సంఘం భవనం

క్రీడలతో మానసికోల్లాసం

మానుకోట ఎస్పీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్


పోటీలు ప్రారంభించి క్రికెట్ ఆడుతున్న ఎస్పీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్

మహబూబాబాద్ రూరల్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : క్రీడలు శారీరక ధృఢత్వంతో పాటు స్నేహభావం, ఉత్సాహన్ని పెంపొందిస్తాయని జిల్లా ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్ అన్నారు. మహబూబాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయంలో మంగళవారం పోలీస్ మాన్యువల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్‌ను బెలూన్‌లను, పోలీస్ క్రీడాకారులు కాంటిజెంట్స్ నిర్వహించి మార్చ్‌పాస్ నిర్వహించగా ఆకాశంలోకి పావురాలను ఎగురవేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. విధి నిర్వహణలో ఎన్ని ఒత్తిళ్లు ఉన్న క్రీడల్లో రాణిస్తున్న పోలీసులు ఇతర క్రీడాకారులకు స్ఫూర్తిగా నిలవాలన్నారు. తొలిరోజు పురుషులు, మహిళలకు వేర్వేరుగా వందమీటర్ల పరుగుపందెంతో పాటు కబడ్డీ, లాంగ్‌జంప్, టెన్నికాయిట్, క్రికెట్, క్యారమ్స్, చెస్, బ్యాట్మింటన్ క్రీడలను నిర్వహించినట్లు చెప్పారు. ఈ క్రీడల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులను త్వరలో జరిగే పోలీస్ రాష్ట్రస్థాయిక్రీడల్లో పాల్గొంటారని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు తిరుపతిరావు, కృష్ణకిశోర్, శ్రీనివాస్, విజయ్‌ప్రతాప్, మోహన్, ఆర్‌ఐలు, ఎస్సైలు, ఏఎస్సైలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

80 కిలోల గంజాయి దహనం

ములుగు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లాలో 18 కేసుల్లో పట్టుబడ్డ 80.2 కిలోల గంజాయిని దహనం చేసినట్లు ఎస్పీ శబరీశ్ తెలిపారు. హనుమకొండలోని కేఎంసీలో గంజాయి డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం శాస్త్రీయ పద్ధతిలో కాల్చివేశారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎస్పీ కోరారు. ప్రతి ఒక్కరూ యాంటీ డ్రగ్ వారియర్‌గా పనిచేయాలని, ఎవరైనా మాదకద్రవ్యాలు రవాణా చేసినా, వినియోగించినా పోలీసులకు సమాచారం ఇవ్వాలని అన్నారు. వివరాలను గోప్యంగా ఉంచుతామని, పారితోషికం కూడా అందిస్తామని తెలిపారు. గంజాయిని నిర్వీర్యం చేసిన ఈ కార్యక్ర మంలో డీసీఆర్‌బీ డీఎస్పీ కిశోర్‌కుమార్, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ రమేష్, తాడ్వాయి ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి, డీసీఆర్‌బీ ఎస్సై జగదీశ్, ములుగు ఎస్సై లక్ష్మారెడ్డి, ఆర్‌ఎస్సై సంపత్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.


గంజాయిని కాల్చి వేయిస్తున్న పోలీసులు

సోలార్ మోడల్ విలేజ్‌గా జగ్గన్నపేట

సర్వే చేసిన ట్రాన్స్‌కో అధికారులు


జగ్గన్నపేటలో సర్వేను పరిశీలిస్తున్న ట్రాన్స్‌కో డీఈ నాగేశ్వర్‌రావు

ములుగు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : ములుగు మండలంలోని జగ్గన్నపేట గ్రామాన్ని సోలార్ మోడల్ విలేజ్‌గా రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసింది. రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీశిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క సొంత గ్రామం నుంచే ఈ ప్రయోగాత్మక పథకానికి యంత్రాంగం శ్రీకారం చుట్టింది. డీఈ పులుసం నాగేశ్వర్‌రావు, ఏడీఈ వేణుగోపాల్, ఏఈ రవి, ఏఏవో శీనయ్య, ఆరు మండలాల సబ్ ఇంజనీర్లు, సిబ్బంది మంగళవారం జగ్గన్నపేటను సందర్శించారు. సోలార్ విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్ల ఏర్పాటు అనుకూలతలను పరిశీలించారు. విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామంలో మొత్తం 227 గృహ, 98 వ్యవసాయ కనెక్షన్లు ఉన్నట్లు గుర్తించారు. ఇప్పటి వరకు 91 మంది లబ్ధిదారులను సోలార్ విద్యుత్ ఉత్పత్తి జాబితాకు ఎంపిక చేశారు. వారం రోజులపాటు సర్వే సాగుతుందని, దాదాపు అన్ని కనెక్షన్లు సోలార్ పరిధిలోకి తీసుకువస్తామని డీఈ నాగేశ్వర్‌రావు తెలిపారు.

గృహ వినియోగదారులకు 2కేవీ, వ్యవసాయ అవసరాలకు 5కేవీ సోలార్ సిస్టంను ఏర్పాటు చేయడం జరుగుతుందని, సొంత అవసరాలకు పోను అదనంగా ఉత్పత్తి అయిన విద్యుత్‌ను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని తెలిపారు. తద్వారా గృహ వినియోగదారులు ఏడాదికి రూ.2 వేల నుంచి రూ.3వేలు, రైతులు రూ.5నుంచి 6వేల వరకు అదనపు ఆదాయం పొందవచ్చని చెప్పారు. సర్వే పూర్తయిన వెంటనే నివేదికను ప్రభుత్వానికి అందజేస్తామని డీఈ తెలిపారు.

కాటారంలో సర్వే

కాటారం (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో విద్యుత్ అధికారులు, సిబ్బందితో కూడిన పలు బృందాలు ప్రధానమంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన (పీఎంఎస్‌జీఎంబీవై) సర్వే మంగళవారం నిర్వహించాయి. పైలట్ ప్రాజెక్ట్ లో భాగంగా కాటారం గ్రామాన్ని మోడల్ సోలార్ విలేజ్‌గా ఎంపిక చేయడంతో విద్యుత్ అధికారులు, సిబ్బంది యుద్ధప్రాతిపదికన సర్వే చేపట్టారు. గ్రామంలోని 1,080 విద్యుత్ మీటర్లు ఉన్న ఇళ్లు, 229 వ్యవసాయ మోటార్లకు సౌర విద్యుత్తు ఉత్పత్తి జరిగేలా పరికరాల బిగింపు కోసం ఇళ్లవారీగా సర్వే నిర్వహిస్తున్నారు. ఈ ప్రక్రియను ట్రాన్స్‌కో భూపాలపల్లి డివిజన్ డీఈఈ పాపిరెడ్డి, ఎంఆర్‌టీ డీఈఈ సదానందం, కాటారం ఏడీఈ నాగరాజు పరిశీలించారు. సర్వే వివరాలను పకడ్బందీగా ఆన్‌లైన్ చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌కో ఏఈ ఉపేందర్, సబ్‌ఇంజనీర్ రాజ్‌కుమార్, లైన్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కాంత్, పలువురు విద్యుత్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


కాటారంలో సర్వేను పరిశీలిస్తున్న విద్యుత్ అధికారులు

వరంగల్ మార్కెట్ ధరలు (రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
మక్కలు (బిల్టీ రకం)	2535	2160
పల్లికాయ (సూక)	6100	5600
పల్లికాయ (పచ్చిది)	4400	4100
కందులు	6850	5560
పెసళ్లు	-	-
పత్తి	7200	5800
కొత్త పత్తి	-	-
తేజ మిర్చి	15300	9000
తేజ ఏసీ	13000	11000
వండర్‌హాట్ ఏసీ	13500	11500
యూఎస్341ఏసీ	13500	11500
దేశీ ఏసీ	-	-
సింగిల్‌పట్టి ఏసీ	-	-
తాలు మిర్చి	6000	3000

- వరంగల్ వ్యవసాయం

తేలిన లెక్క

మానుకోట జిల్లాలో సాగుకు పనికిరాని 8,235 ఎకరాలు

మహబూబాబాద్ అగ్రికల్చర్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో సాగుకు యోగ్యత లేని, పనికిరాని భూముల వివరాల లెక్కను అధికారులు తేల్చారు. సోమవారం అర్ధరాత్రి వరకు వ్యవసాయ, రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖల అధికారులు ఆ లెక్కలను తేల్చారు. జిల్లాలో వ్యవసాయ అధికారుల వద్ద నమోదైన మొత్తం వ్యవసాయ భూమి 369859.65 ఎకరాలు ఉండగా.. 8235.42 ఎకరాలను సాగుకు పనికిరాని భూములుగా అధికారులు గుర్తించారు. ఇళ్లు, కాలనీలుగా మారిన అన్ని రకాల భూములు 772.99 ఎకరాలు, లేఅవుట్‌లు, రోడ్లుగా మారిన భూములు, పరిశ్రమలు, గోదాములకు, మైనింగ్ వినియోగిస్తున్న భూములు 2863.77 ఎకరాలు, ప్రభుత్వం సేకరించిన అన్ని రకాల భూములు 479.80 ఎకరాలు, రాళ్లు, రప్పలు, గుట్టలతో నిండి సాగుకు అనువుగా లేని భూములు 3431.45 ఎకరాలు, ఇతర సాగుకు పనికిరాని భూములు 687.42 ఎకరాలు వెరసి 8235.42 ఎకరాలుగా తేలింది. అయితే ఈ వివరాలను మంగళవారం జరుగుతున్న గ్రామసభల్లో ప్రవేశపెట్టి ప్రజల అభిప్రాయాన్ని సేకరించనున్నారు.


సీరోలు మండలంలో గుట్టలను సర్వే చేస్తున్న వ్యవసాయాధికారి విజయనిర్మల

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలి

నెహ్రూసెంటర్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ఏటూరునాగారం వారి ఆధ్వర్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలో గల గిరిజన నిరుద్యోగ యువతీయువకుల కోసం ఈ నెల 28న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఐటీడీఏ పీవో చిత్రమిశ్రా మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నిరుద్యోగ యువతీ యువకులకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగ అవకాశాలను కల్పించేందుకు ఐటీడీఏ ఆధ్వర్యంలో ఈ నెల 28న మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉదయం 10 గంటలకు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, పీజీ, ఐటీఐ, డిప్లొమా, బీఫార్మసీ, ఎంఫార్మసీ, డీఫార్మసీ, ఏఎన్ఎం, జీఎన్ఎం, ఎంబీఏ, ఎంసీఏ, బీటెక్ చదివి ఖాళీగా ఉన్న యువతీ యువకులు ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువతీయువకులు పూర్తి వివరాల కోసం సెల్ : 8330954571 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

కుమారుడి మరణం తట్టుకోలేక..

పది రోజుల వ్యవధిలోనే తల్లి మృతి


నగేష్, యాకమ్మ (ఫైల్)

కొత్తగూడ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : విధి ఆ కుటుంబాన్ని పగ పట్టింది.. పది రోజుల వ్యవధిలోనే ఆ ఇంట్లో కుమారుడు, తల్లి మృతి చెందారు. కుమారుడి మృతి తట్టుకోలేక తల్లి గుండెపోటుతో మంగళవారం మృతి చెందింది. ఈ హృదయ విదారక సంఘటన కొత్తగూడ మండల కేంద్రంలోని బూరుగు గుంపులో గట్టి నగేష్ (30) ఈనెల 8న అనారోగ్యంతో మృతి చెందాడు. నగేష్ దశదిన కర్మను ఆదివారం నిర్వహించారు. కుమారుడి మృతి తట్టుకోలేక యాకమ్మ (50) మనస్తాపంతో మంగళవారం మృతి చెందింది. ఆ ఇంట్లో వరుస మరణాలు జరుగుతుండడంతో బూరుగు గుంపులో విషాదం నెలకొంది.

అత్యాశే సైబర్ నేరాలకు ఆయుధాలు

సైబర్ సెక్యూరిటీ డీఎస్పీ శ్రీనివాస్

మహబూబాబాద్ రూరల్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : విలాసవంతమైన వస్తువులు ఇస్తామని, ప్లాట్లు రిజస్ట్రేషన్ చేస్తామని విదేశీ యాత్రలకు పంపుతామని మాయమాటలతో ఆఫర్లు పెట్టి ప్రజలను మోసం చేస్తూ సైబర్ నేరగాళ్లు బ్యాంక్ ఖాతాల్లోని నగదును ఖాళీ చేస్తున్నారని సైబర్ సెక్యూరిటీ డీఎస్పీ కె.శ్రీనివాస్ మంగళవారం ఒకప్రకటనలో తెలిపారు. సైబర్ నేరాల పట్ల మొబైల్ ఫోన్‌లను చూసే మనకు ఫేస్‌బుక్, వాట్సాప్, టెలిగ్రామ్, ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్, ఈమెయిల్, ఫోన్ కాల్ ద్వార మీ దృష్టిని ఆకర్షించే కుట్రలకు సైబర్ నేరగాళ్లు పాల్పడుతున్నారని చెప్పారు. మోసాలకు పాల్పడితే టోల్ ఫ్రీ నెంబర్ 1930కు సమాచారం అందించాలన్నారు.

ఏఐకేఎంఎస్ రాష్ట్ర కార్యవర్గం ఎన్నిక


భిక్షపతి వెంకన్న

మహబూబాబాద్ రూరల్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్‌లోని గంగపుత్ర భవనంలో రెండు ఏఐకేఎం ఎస్‌ల విలీన రాష్ట్ర సభను నిర్వ హించారు. అనంతరం అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులుగా వక్కంతుల కోటేశ్వర్‌రావు, రాష్ట్ర అధ్యక్షు లుగా మామిడాల భిక్షపతి, ప్రధాన కార్యదర్శిగా మండల వెంకన్నతో పాటు 35 మంది కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

విధుల్లో అలసత్వం వీడాలి

మానుకోట డీఎంహెచ్‌వో మురళీధర్

దంతాలపల్లి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక కేంద్రం ఆధ్వర్యంలో పని చేస్తున్న వైద్యసిబ్బంది విధి నిర్వహణలో అలసత్వం వీడాలని జిల్లా వైద్యాధికారి మురళీధర్ అన్నారు. మంగళ వారం ఆయన మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై ప్రజల్లో అవగా హన కల్పించాలన్నారు. పీహెచ్‌సీకి వచ్చే రోగులకు సకాలంలో వైద్యం అందేలా చర్యలు చేపట్టాలన్నారు. సబ్‌సెంటర్ పరిధిలో పని చేసే ఏఎన్ఎంలు స్థానికంగానే ఉండి వైద్య సేవలు అందించాలన్నారు.

సుఖప్రసవాల కోసం గర్భిణులను పీహెచ్‌సీకి వచ్చేవిధంగా అవగాహన కల్పించాలన్నారు. గ్రామాల వారీగా ఏఎన్ ఎంలు గర్భి ణులు, ప్రసవ మహిళలు, పాముకాటు, తేలుకాటు వివరాలను అం దుబాటులో ఉంచుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో వైద్యులు చైతన్య, కవిత, హెల్త్ విజిటర్స్ ఫార్మసిస్టు, ఏఎన్ఎంలు, స్టాఫ్‌నర్సు పద్మ తదితరులు పాల్గొన్నారు.

గుడుంబా విక్రయిస్తే కఠిన చర్యలు

ఎక్సైజ్ ఇన్‌చార్జి సీఐ ప్రవీణ్


తొర్రూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): గుడుంబా తయారు చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తప్పవని తొర్రూరు ఎక్సైజ్ ఇన్‌చార్జి సీఐ ఆర్. ప్రవీణ్ అన్నారు. మంగళవారం స్టేషన్ పరిధిలోని వివిధ గ్రామాల్లో సిబ్బందితో కలిసి తనిఖీలు చేపట్టి అక్రమంగా నిల్వ చేసిన 150 లీటర్ల నాటుసారా, బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గుడుంబా తయారీకి వినియోగించే బెల్లం, పటిక రవాణా జరగకుండా తగిన చర్యలు చేపడుతున్నామన్నారు. గుడుంబాను నివారించేందుకు అన్ని చర్యలు చేపడుతున్నామన్నారు. గుడుంబా నివారణకు ప్రజ లు సహకరించాలని కోరారు. ఈ తనిఖీల్లో ఎస్సైలు రవళి, తిరుపతి, మహేందర్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

గురు పోరు!

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సమాయత్తం

- ఉమ్మడి వరంగల్, నల్లగొండ, ఖమ్మం జిల్లాల్లో ఎన్నికలు
- ఇప్పటికే పోటీ చేసే అభ్యర్థులను ప్రకటిస్తున్న ఉపాధ్యాయ సంఘాలు





(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలపై పలు సంఘాలు, రాజకీయ పార్టీలు దృష్టి సారించాయి. మార్చి 29వ తేదీతో వరంగల్, నల్లగొండ, ఖమ్మం ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి పదవీకాలం పూర్తికానుంది. ఈ నేపథ్యంలో ఇప్పటికే ఎన్నికల సంఘం ఓటరు నమోదు కార్యక్రమాన్ని పూర్తి చేసింది. ఫిబ్రవరి మూడో లేదా చివరి వారంలో నోటిఫికేషన్ ఇచ్చే అవకాశం ఉంది. దీంతో ఇప్పటి నుంచే ఆయా ఉపాధ్యాయ సంఘాలు, రాజకీయ పార్టీలు తమ అభ్యర్థులను బరిలో నిలిపేందుకు కసరత్తు చేస్తున్నాయి. కొన్ని ఉపాధ్యాయ సంఘాలతో పాటు బీజేపీ.. తమ అభ్యర్థులను ప్రకటించి ఎన్నికల ప్రచారాన్ని కూడా మొదలు పెట్టాయి. అయితే అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్‌ల వైఖరి ఏమిటనేది ప్రశ్నార్థకంగా మారింది. పార్టీ తరపున అభ్యర్థులను బరిలో దింపుతారా? లేక ఏదైనా ఉపాధ్యాయ సంఘానికి మద్దతు ఇస్తారా? అనేది ఉత్కంఠగా మారింది.

మార్చిలో పోలింగ్

వరంగల్, నల్లగొండ, ఖమ్మం ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి పదవీకాలం మార్చి29వ తేదీతో పూర్తికానుంది. దీంతో ఎన్నికల సంఘం టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికకు కావాల్సిన ఏర్పాట్లను చేపట్టింది. గత అక్టోబరు నెల నుంచి ఉపాధ్యాయ ఓటరు నమోదును చేపట్టింది. డిసెంబరు 31న తుది ఓటరు జాబితాను ప్రకటించింది. మొత్తం 24,905 మంది ఓటర్లుగా తమ పేరును నమోదు చేసుకున్నారు. వీరిలో ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి 10,960మంది ఓటర్లు, ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి 8,041మంది ఓటర్లు, ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి 5,904మంది ఓటర్లు ఉన్నారు. మొత్తం 24,905మందిలో 14,940మంది పురుషులు, 9,965మంది మహిళ ఓటర్లు ఉన్నారు. 2019 మార్చిలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో 20,888మంది ఓటర్లు మాత్రమే ఉన్నారు. ఈసారి అదనంగా 4,017మంది ఓటర్లు అదనంగా నమోదయ్యారు. అలాగే 2019లో 181 పోలింగ్ కేంద్రాలు ఉండగా, ఈసారి 200పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. అదనంగా 19 పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ఎన్నికల సంఘం ఏర్పాట్లు చేస్తోంది. ఇందులో ఉమ్మడి వరంగల్ జిల్లాలో 76 పోలింగ్ కేంద్రాలు, ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 77 పీసీలు, ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 47 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. అలాగే ఈ తుది ఓటరు జాబితా ఆధారంగా ఫిబ్రవరి మూడో లేదా చివరివారంలో ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేసి, మార్చి రెండో వారంలో ఎమ్మెల్సీ ఎన్నికలను నిర్వహించనున్నారు. అయితే మొత్తం 55 ఉపాధ్యాయ సంఘాలు ఉండగా, ప్రధానంగా ఎన్నిక బరిలో నాలుగైదు సంఘాలే పాల్గొంటున్నాయి.

పార్టీలకు సవాల్‌గా టీచర్ ఎమ్మెల్సీ

వరంగల్, నల్లగొండ, ఖమ్మం ఉమ్మడి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలే అయినప్పటికీ వీటిలో ఆయా రాజకీయ పార్టీలే కీలక పాత్ర పోషిస్తున్నాయి. టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా బీజేపీ ఏకంగా సరోత్తమ్‌రెడ్డి పేరును ప్రకటించింది. గత 2019 ఎన్నికల్లో పీఆర్‌టీయూ అభ్యర్థి పూల రవీందర్‌కు బీఆర్ఎస్ మద్దతు ప్రకటిం చింది. యూటీఎఫ్ అభ్యర్థి నర్సిరెడ్డికి సీపీఎం, ఇతర వామపక్షాలు అండగా నిలుస్తున్నాయి. ప్రస్తుతం కూడా నర్సిరెడ్డికి వామపక్షాలు బాసటగా నిలుస్తుండగా, కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు మద్దతు ఎవరికి అనేది ఉత్కంఠగా మారింది. టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీకి బీఆర్ఎస్ సుముఖత వ్యక్తం చేయటం లేదు. అయితే టీచర్ జాక్ పేరుతో బరిలో దిగుతున్న మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్‌కు బీఆర్ఎస్ మద్దతు ఇస్తుందా? లేక ఇండిపెండెంట్‌గా బరిలో దిగనున్న వరంగల్ కూడా మాజీ చైర్మన్ సుందర్‌రాజ్‌యాదవ్‌కు మద్దతు ఇస్తుందా? అనేది ఆసక్తికరంగా మారింది. వరంగల్, నల్లగొండ ఖమ్మం ఉమ్మడి జిల్లాలో బీఆర్ఎస్‌కు ఉపాధ్యాయుల్లో మద్దతుదారులు ఉన్నారు. దీంతో బీఆర్ఎస్ మద్దతు ఎవరికి అనేది ఆసక్తికరంగా మారింది. ఇక అధికార కాంగ్రెస్ పార్టీ సైతం టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అభ్యర్థిని నిలపెట్టడంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. గత రెండు ఎన్నికల్లో కాంగ్రెస్ ఎవరికి మద్దతు ఇవ్వలేదు, అభ్యర్థిని కూడా బరిలో దించలేదు. శాసనమండలిలో ఎమ్మెల్సీ సంఖ్య అవసరం కావటంతో కచ్చితంగా పోటీ చేయడమా? లేక ఏదైనా ఉపాధ్యాయ సంఘానికి మద్దతుగా నిలవటమో కాంగ్రెస్ చేస్తుందనే చర్చ జరుగుతోంది. మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్ సైతం కాంగ్రెస్ మద్దతు కోసం ప్రయత్నాలు చేస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. దీంతో కాంగ్రెస్ తీసుకునే నిర్ణయమే ఎమ్మెల్సీ ఎన్నికలపై ప్రభావం చూపించే అవకాశం ఉంది. మొత్తానికి టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలైనప్పటికీ రాజకీయ రంగు పడటం ఖాయంగా కనిపిస్తోంది.

12 జిల్లాలోని ఓటర్లు, పోలింగ్ కేంద్రాల వివరాలు..

జిల్లా	పోలింగ్ కేంద్రాలు	ఓటర్లు
వరంగల్	13	2,225
హనుమకొండ	15	5,098
మహబూబాబాద్	16	1,618
జనగామ	12	921
భూపాలపల్లి	07	323
ములుగు	09	612
సిద్దిపేట	04	163
నల్లగొండ	37	4,483
సూర్యాపేట	23	2,637
యాదాద్రి భువనగిరి	17	921
ఖమ్మం	24	3,955
భద్రాద్రి కొత్తగూడెం	23	1,949
మొత్తం	200	24,905

తేల్చుకుందాం రా..

ఎమ్మెల్సీ ఎన్నికల్లో తలపడేందుకు ఉపాధ్యాయ సంఘాలు సన్నద్ధం అవుతున్నాయి. తెలంగాణలో 55కుపైగా ఉపాధ్యాయ సంఘాలు ఉన్నప్పటికీ ప్రధానంగా టీజీ యూటీఎఫ్, పీఆర్‌టీయూ, తపస్ మధ్యే ప్రధానంగా పోటీ నెలకొంది. 2019 మార్చిలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీఆర్‌టీయూ అభ్యర్థి పూల రవీందర్‌పై టీజీ యూటీఎఫ్ అభ్యర్థి అలుగుబెల్లి నర్సిరెడ్డి విజయం సాధించారు. ఈసారి పక్కాగా ఎమ్మెల్సీ సీటు దక్కించుకోవాలని మూడు ప్రధాన సంఘాలతో పాటు టీజీ జాక్, స్వతంత్ర అభ్యర్థులు సైతం పోటీ పడుతున్నారు. ఇప్పటికే టీజీ యూటీఎఫ్ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి మరోసారి బరిలో దిగనున్నట్లు ఆ సంఘం ప్రకటించింది. అలాగే పీఆర్‌టీయూ నుంచి ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పింగిళి శ్రీపాల్‌రెడ్డి బరిలో దిగుతున్నారు. ఇక బీజేపీ నుంచి మాజీ పీఆర్‌టీయూ నేత సరోత్తంరెడ్డి పోటీకి దిగుతున్నారు. తపస్ మద్దతుతో బీజేపీ అభ్యర్థి బరిలో దిగుతుండటం, మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్ టీచర్స్ జాక్ పేరుతో పోటీకి సై అంటుండటంతో పోటీ ఆసక్తికరంగా మారింది. అయితే వీరితో పాటు విద్యాసంస్థల అధినేత, మాజీ కూడా చైర్మన్ సుందర్‌రాజ్ యాదవ్‌తో పాటు మరో సంఘం నుంచి హర్షవర్ధన్‌రెడ్డి, సీపీఎస్ సంఘం నుంచి వెంకటస్వామి లాంటి నేతలు బరిలో ఉంటున్నట్లు ప్రకటించారు. వీరితో పాటు డజను మందికిపైగా ఇండిపెండెంట్‌లుగా పోటీ చేసేందుకు ముందుకు వస్తుడటంతో ఎమ్మెల్సీ ఎన్నికలు రసవత్తరంగా మారుతున్నాయి. అయితే ఈ ఎన్నికలను పీఆర్‌టీయూ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటోంది. 2013లో పీఆర్‌టీయూ నుంచి గెలిచిన పూల రవీందర్.. ఆ తరువాత బీఆర్ఎస్‌లోకి వెళ్లారు. దీంతో ఆయన కొంత వ్యతిరేకతను ఎదుర్కొన్నారు. 2019లో పీఆర్‌టీయూ అభ్యర్థిగా పూల రవీందర్ బరిలో దిగారు. బీఆర్ఎస్ మద్దతు ప్రకటించినప్పటికీ టీజీ యూటీఎఫ్ అభ్యర్థి నర్సిరెడ్డి చేతిలో ఓటమిపాలయ్యారు. అయితే పీఆర్‌టీయూ రెబల్ అభ్యర్థిగా సరోత్తమ్‌రెడ్డి బరిలో ఉండటంతో పూల రవీందర్‌కు దెబ్బగా మారింది. దీంతో ఈసారి పక్కాగా ఎమ్మెల్సీ సీటు దక్కించుకోవాలని పీఆర్‌టీయూ, సిట్టింగ్ సీటును నిలపెట్టుకోవాలని యూటీఎఫ్‌లు ప్రత్యేకంగా దృష్టి పెట్టగా, తపస్ సహకారంతో ఎమ్మెల్సీ సీటులో పాగా వేయాలని బీజేపీలు తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నాయి. దీంతో ఇప్పటికే ఉపాధ్యాయ సంఘాలు తమ అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ ప్రచారాన్ని ముమ్మరం చేస్తున్నాయి. ఉమ్మడి వరంగల్, నల్లగొండ, ఖమ్మం జిల్లాల పరిధిలోని ఉపాధ్యాయులను వ్యక్తిగతంగా కలుసుకుంటూ మద్దతు కోరుతున్నారు. తక్కువ ఓట్లు ఉండటంతో గెలుపోటములకు ఒక్క ఓటు కూడా కీలకం కావటంతో అభ్యర్థులు ప్రతీ ఓటరు కలుసుకునేలా ప్రణాళికతో వెళుతున్నారు.

బిజీ జూ

వన విజ్ఞాన్‌కు పెరిగిన సందర్శకుల తాకిడి

- పులులు, బైసన్ల రాకతో కళకళలాడుతున్న పార్కు
- రెండింతలు పెరిగిన ఆదాయం
- త్వరలో సింహం, తెల్లపులి రాక





పార్కుకు వస్తున్న పర్యాటకులు

అడవి దున్న

హనుమకొండ కలెక్టరేట్, జనవరి21(ఆంధ్రజ్యోతి): హనుమకొండ హంటర్‌రోడ్‌లో ఉన్న జూపార్కుకు పర్యాటకుల తాకిడి రోజురోజుకూ పెరుగుతోంది. హనుమకొండ, వరంగల్ నగరాలతో పాటు చుట్టు పక్కల ప్రాంతాల నుంచి కూడా పర్యాటకులు కుటుంబ సమేతంగా తరలివచ్చి పార్కులో ఉన్న జంతువులను, పక్షులను చూస్తూ సరదాగా గడుపుతున్నారు. కొన్నేళ్ల కిందట పార్కుకు వచ్చిన చిరుతపులిని దూరప్రాంతాల ప్రజలు వచ్చి తిలకించేవారు. అయితే జిల్లా అటవీ శాఖ అధికారులు హైదరాబాద్‌లోని నెహ్రూ జులాజికల్ పార్కు నుంచి ఇటీవల జూపార్కుకు తీసుకువచ్చిన రెండు పెద్ద పులులు, అడవిదున్న, హగ్‌డీర్, బార్కింగ్ డీర్‌లకు సంబంధించిన ఎన్‌క్లోజర్‌లను 10రోజుల కిందట రాష్ట్ర అటవీశాఖ మంత్రి కొండా సురఖ ప్రారంభించిన విషయం తెలిసిందే. దీంతో పార్కుకు కొత్తగా వచ్చిన పెద్ద పులులు, అడవిదున్న, హగ్‌డీర్‌లను చూసేందుకు పర్యాటకులు ఉత్సాహంగా పార్కుకు వచ్చి జంతువులను ఆసక్తిగా చూస్తున్నారు. పర్యాటకుల తాకిడి పెరగడంతో జూపార్కుకు ఆదాయం కూడా రెండింతలు పెరిగింది.

పెద్ద సంఖ్యలో రాక

గతంలో పెద్ద పులులను ప్రజలు టీవీలలో లేదా సెల్ ఫోన్‌లలో మాత్రమే చూసేవారు. పులులను చూడాలనే ఆసక్తి ఉన్న ప్రజలు హైదరాబాద్‌లోని నెహ్రూ జూపార్కుకు వెళ్లి చూసి వచ్చేవారు. అయితే హనుమకొండ జూపార్కుకు రెండు పులుల రావడంతో పులులను చూడాలనుకునేవారికి మంచి అవకాశం వచ్చింది. దీంతో ట్రైసిటీస్‌లోని ప్రజలు పులులను చూసేందుకు జూపార్కు బాట పడుతున్నారు. ముఖ్యంగా ఆదివారం రోజు స్కూళ్లు, కాలేజీలు, ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు రోజు కావడంతో ఆదివారం పర్యాటకుల తాకిడి మరింత పెరుగుతోంది.

త్వరలో సింహం, తెల్లపులి రాక

త్వరలో జూపార్కుకు సింహంతోపాటు తెల్లపులిని తీసుకువచ్చేందుకు జిల్లా అటవీ శాఖ అధికారులు మంతనాలు జరుపుతున్నారు. ఇవి కూడా పార్కుకు వస్తే పర్యాటకుల తాకిడి మరింత పెరిగి ఆదాయం కూడా పెరిగే అవకాశం ఉంది. ఈ జూపార్కు వరంగల్, కాజీపేట, హనుమకొండ ప్రజలకు మధ్యలో ఉండి అందుబాటులో ఉండటంతో ఈ ప్రాంతాల ప్రజలు ఎక్కువగా పార్కుకు వస్తున్నారు.

ఆదాయం డబుల్

గతంతో పోలిస్తే జూపార్కుకు వచ్చే ఆదాయం ప్రస్తుతం రెట్టింపైంది. గతంలో నెలకు రూ.10వేల నుంచి 12వేలు వచ్చేదని, పులులు, ఇతర జంతువులు వచ్చినప్పటి నుంచి ఆదాయం నెలకు రూ.20వేల నుంచి 25వేలు వస్తోందని జిల్లా అటవీ శాఖ అధికారులు తెలిపారు. పర్యాటకుల తాకిడి ఆదివారం ఎక్కువగా ఉంటోందని చెబుతున్నారు.

పులుల రాకతో పెరిగిన పర్యాటకులు

ఇటీవల జూపార్కుకు రెండు పులులు, అడవిదున్నతోపాటు మరిన్ని కొత్త జంతువులు వచ్చాయి. దీంతో ఈ కొత్త జంతువులను చూసేందుకు ప్రజలు జూపార్కుకు తరలివస్తున్నారు. ఆదాయం కూడా గతంతో పోలిస్తే ఇప్పుడు మరింత పెరిగింది. హనుమకొండ వరంగల్, కాజీపేట ప్రాంతాల నుంచి ఎక్కువగా పర్యాటకులు కుటుంబంతో కలిసి జంతువులను చూసేందుకు పార్కుకు వస్తున్నారు.

- జూపార్కు బీట్ ఆఫీసర్ శారద

చిత్రకళాద్రష్ట కొండపల్లి

- కుంచెతో చరిత్ర చిత్రిక
- భారతీయ సంప్రదాయ చిత్రకళకు వన్నెలు
- పోతనకు మొదటి సారి చిత్రరూపం
- తెలుగు తల్లి ఆవిష్కరణ
- నేడు ప్రముఖ చిత్రకళాకారుడు కొండపల్లి శేషగిరిరావు జయంతి



వరూధిని ప్రవరాఖ్యుడు



కొండపల్లి శేషగిరిరావు

హనుమకొండ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : కదిలే ఊహలకు రేఖాకృతి కలిగిస్తే అది చిత్రలేఖనం. చిత్రాన్ని రచించడం ఒక మధుర సాధన. చిత్రాన్ని చూసి ఆనందించడం మధురతర సాధన. ఈ రెండింటిలోనూ శిఖరాగ్రస్థాయికి చేరిన మనీషి కొండపల్లి శేషగిరి రావు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన చిత్రకారుల్లో లబ్ధప్రతిష్ఠుడు ఆయన.. ఈ నెల 22న శేషగిరిరావు జయంతి సందర్భంగా ఆయన చిత్రకళా ప్రతిభపై కథనం.

మానుకోట వాసి

తెలుగు చిత్రకళా ప్రపంచంలో ఓ వటవృక్షం అయిన కొండపల్లి శేషగిరిరావు 1924లో మహబూబాబాద్ జిల్లా పెనుగొండలో జన్మించారు. ఒక బ్రాహ్మణ భూస్వామ్యకుటుంబంలో జన్మించిన శేషగిరిరావు తండ్రి గోపాలరావు. తల్లి రామచూడామణి. శేషగిరిరావులోని సృజనాత్మకతను గుర్తించిన పాఠశాల డ్రాయింగ్ మాస్టర్ దీనదయాళ్.. ఆనాడే కొండపల్లి గొప్ప కళాకారుడు అవుతాడని ప్రకటించారు. 1947లో ఆర్ట్ డిప్లొమా పరీక్షల్లో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు. బెంగాల్ శాంతినికేతన్‌లో చిత్రలేఖనం అభ్యసించారు. ఆచార్య నందలాల్ బోసు శిష్యరికంలో చిత్రకళలో అనేక మెళకువలు నేర్చుకున్నారు. 1950 నుంచి 1984 వరకు హైదరాబాద్ స్కూల్ ఆఫ్ ఆర్ట్స్‌లో ఉపాధ్యాయుడిగా పని చేశారు. బాల్యంలో ఆయన చుట్టూ ఉన్న కళా సంపద కళాభిమానాన్ని తట్టిలేపింది. వేయిస్తంభాల గుడిలోని ప్రతీ స్తంభం ఆయనకు రోజుకో పాఠం చెప్పింది. రామప్పగుడిలోని శిల్పకళా సౌందర్యం హృదయాంతరాలల్లో నిండిపోయింది. కాకతీయుల దేవాలయాల్లోని శిల్పాల సోయగంపై సునిషిత అధ్యయనం చేసిన కొండపల్లి.. వాటి నుంచి పొందిన స్ఫూర్తితో కొన్ని వందల చిత్రాలను గీశారు. శిల్పుల మనోగతాల్ని, వారి అభిరుచిలో తొంగిచూసిన ప్రత్యేకతలను, విశిష్టతలను తాను అవగతం చేసుకోవడమే కాక తన చిత్రాల ద్వారా ప్రజాబాహుళ్యానికి చాటిచెప్పే ప్రయత్నం చేశారు. భారతీయ ఇతిహాసాలను చిత్రిక పట్టడంలో శేషగిరిరావుది అందెవేసిన చేయి. ప్రకృతి, చారిత్రక గాథలను ముఖ్యంగా కాళిదాసు అభిజ్ఞాన శాకుంతలాన్ని ఆయన సజీవ చిత్రాలుగా మలిచారు. ఆక్వాటెక్స్చర్ పెయింటింగ్‌లకు ఆయన మార్గదర్శకుడిగా చెబుతారు. లండన్, అమెరికా, మాస్కో తదితర దేశాల్లో జరిగిన ఎగ్జిబిషన్లలో ప్రదర్శనకు ఉంచిన శేషగిరిరావు చిత్రాలకు అనేక ప్రశంసలు వచ్చాయి. సాలార్‌జంగ్ మ్యూజియం సహా వాషింగ్టన్ డీసీలోని భారత రాయబార కార్యాలయం, పిట్స్‌బర్గ్‌లోని వెంకటేశ్వరస్వామి ఆలయానికి ఆయన చిత్రాలు మరింత శోభను తీసుకువచ్చాయి.

పోతనకు రూపం

40 ఏళ్ల కిందట వరంగల్‌లో పోతన పంచశతి ఉత్సవాలు జరిగినప్పుడు పోతన చిత్రానికి మొట్టమొదటి సారిగా రూపం ఇచ్చింది శేషగిరిరావు. అంత అందం, అంత ప్రశాంతత, అంత భక్తిభావం ఆ చిత్రలో ఆయన ఒలికించారు. పోతన భాగవతాన్ని 16సార్లు చదివి తన మనోఫలకంపై ముద్రిం చుకున్నందు వల్లనే పోతన చిత్రంలో అంత జీవం వచ్చినట్టు చెబుతారు. శేషగిరి రావు కొన్ని వేల చిత్రాలను గీశారు. రాణి రుద్రమ దేవి, గణపతి దేవుడు, పల్నాటి బ్రహ్మనాయుడు లాంటి చారిత్రక వ్యక్తులు, శకుంతల, వరూధినీ ప్రవరాఖ్యుడు, దమయంతి వంటి ఇతిహాస వ్యక్తుల చిత్రాలు ఆయన కుంచె నుంచి జాలువారాయి. కాకి పడగలు పట చిత్రాలను వెలుగులోకి తెచ్చారు. తొలి ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా కొండపల్లి తెలుగు తల్లిని సాక్షాత్కరింప చేశారు. తెలుగు చిత్రకళను అంతర్జాతీయ వేదికపై సగౌరవంగా నిలబెట్టిన కొద్దిమందిలో శేషగిరారావు ఒకరు.

అవార్డులు

శేషగిరిరావు చిత్రకళా ప్రతిభను గుర్తించిన అనేక సంస్థలు ఆయనను సముచితంగా సత్కరించాయి. అవార్డులను ప్రదానం చేశాయి. హైదరాబాద్, మైసూరు, మద్రాసు, ఆలిండియా ఆర్ట్ ఎగ్జిబిషన్, కోల్‌కతా అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్, ఏపీ లలిత కళా అకాడమీ అవార్డులను ప్రదానం చేశాయి. కేంద్ర మానవ వనరుల శాఖ పక్షాన 1988లో ఎమిరేటస్ ఫెలోషిప్‌ను, తెలుగు యూనివర్సిటీ ద్వారా డాక్టరేట్‌ను ఆయన అందుకున్నారు. ప్రతిష్ఠాత్మకమైన హంస అవార్డును కూడా ఆయన పొందారు. చిత్రకారుడిగా కొండపల్లి శేషగిరిరావు తను అనుభవాలను, చిత్ర రచనా పద్ధతులను వివరిస్తూ రాసిన వ్యాసాలను కొండపల్లి నీహారిణి సంపాదకత్వంలో చిత్రకళా రామణీయకం పేరుతో 2011లో ప్రచురితమైంది.

దర్గా దర్శనం.. ముక్తి మార్గం..

500 ఏళ్ల చరిత్ర కలిగిన మాషూక్ రబ్బానీ దర్గా

నేటి నుంచి ఉత్సవాలు ప్రారంభం



విద్యుత్ దీపాల వెలుగుల్లో ఉర్సు దర్గా



మాషూక్ రబ్బానీ కుమారుడైన గౌస్ మోయినోద్దిన్ ఖాద్రీ పవిత్ర సమాధి దర్గా

కరీమాబాద్, జనవరి 21, (ఆంధ్రజ్యోతి):వరంగల్ అండర్ రైల్వే గేటు ప్రాంతంలో ప్రసిద్ధిగాంచిన హజ్రత్ మాషూఖ్ రబ్బాని దర్గాకు 500 వందల ఏళ్ల చరిత్ర ఉంది. ఎలాంటి సమస్యలున్నా ఈ దర్గాను ఒక్కసారి దర్శించుకుంటే చాలు.. సకల సమస్యలు దూరమవుతాయని ప్రజల నమ్మకం. ఏటా ఇక్కడ జరిగే ఉత్సవాలకు దేశవిదేశాల నుంచి లక్షలాది మంది తరలివస్తారు. కులమతాలకు అతీతంగా అన్ని వర్గాల వారు ఈ దర్గాను దర్శించుకోవడం విశేషం. బుధవారం నుంచి ఈ నెల 24వ తేదీ వరకు ఇక్కడ అట్టహాసంగా వేడుకలు జరిపేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి.

మాషూఖ్ రబ్బానీ, దర్గా చరిత్ర

ఇరాక్ దేశం బాగ్దాద్ ప్రాంతం నుంచి భారతదేశానికి వచ్చిన ఔళియా (అవదూత)లల్లో మాషూఖ్ రబ్బానీ హహమతుల్లాలై ఒకరు. ఈయన అసలు పేరు సయ్యదనా జలాల్ ఉద్దీన్ జమాల్ అల్ బహర్. 12 ఏళ్ల చిరు ప్రాయంలోనే ఆయన తల్లి శిక్షణలో ఖురాన్ కంఠస్తం చేశారు. ప్రజలకు ధార్మిక సిద్ధాంతాలను తెలియజేసే పర్యటనలో భాగంగా ఆయన వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం తురుకల సోమారం గ్రామ గుట్టల్లో విడిది చేశారు. ఆ ప్రాంత వాసులను రకరకాల రుగ్మతలను నయంచేశారు. అంధులకు దృష్టిని ప్రసాదించి తన మహిమను చూపారు. అనంతరం అక్కడి నుంచి ఉర్సు ప్రాంతానికి వచ్చారు. ఉర్సు ప్రాంతంలోని గుట్టల్లో 12 ఏళ్ల పాటు దైవారాధన చేస్తూ ప్రజలను ఎన్నో రుగ్మతల నుంచి విముక్తుల్ని చేస్తూ తన 81వ యేట పరమపదించారు. ఆయనను సమాధి చేసిన ప్రాంతమే ఈ ఉర్సు దర్గా.

వైభవంగా ఉర్సు (సంధల్) ఉత్సవాలు

ఉర్సు (సంధల్) ఉత్సవాలు ఈ నెల 22, 23, 24 తేదీల్లో మూడు రోజుల పాటు కొనసాగనున్నాయి. బుధవారం రాత్రి మాషూఖ్ రబ్బానీ పవిత్ర సమాధికి సంధల్ కార్యక్రమం (గంధలేపనం) నిర్వహిస్తారు. ఈ సందర్భంగా పీఠాధిపతులు సయ్యద్‌షా హైదర్ హిలాలోద్దిన్ ఖాద్రీ నవీద్ బాబా ఇంటి నుంచి గంధాన్ని దర్గాకు తీసుకువెళ్తారు. ఈ సందర్భంగా ఫకీర్లు చేసే విన్యాసాలు ఒళ్లు గుగుర్పొడిచే విధంగా ఉంటాయి. 23వ తేదీన ఉత్సవాలు, 24న ప్రత్యేక ప్రార్థనలతో ఉత్సవాలు ముగుస్తాయి.

వివిధ ప్రాంతాల నుంచి సందర్శకుల రాక

దర్గా ఉత్సావాలకు దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో మత గురువులు, భక్తులు, సందర్శకులు వస్తుంటారు. వారికి మహాన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. రబ్బానీ వారసులు, పీఠాధిపతులు సయ్యద్ షా హైదర్ హిలాలోద్దిన్ ఖాద్రీ నవీద్ బాబా, ఉబేద్ బాబాల ఆధ్వర్యంలో ఈ వేడుకలు నిర్వహిస్తున్నారు.

దర్గా ప్రాంతంలో విశాలమైన మజీద్

దర్గా పరిసరాలల్లో ముస్లింలు ప్రార్థన చేసుకునేందుకు విశాలమైన మజీద్ అన్ని హంగులతో సిద్ధమైంది.ఒకేసారి దాదాపు 1500 మంది ప్రార్థన చేసుకునే అవకాశం ఈ దర్గాలో ఉంది. ప్రతీ శుక్రవారం వేల సంఖ్యలో ముస్లింలు ఈ మజీద్‌లో ప్రార్థన చేస్తారు.



ఉత్సవాలను విజయవంతం చేయండి..

అత్యంత అట్టహాసంగా బుధవారం నుంచి ప్రారంభమయ్యే మాషూక్ రబ్బానీ దర్గా ఉత్సవాలను విజయవంతం చేయాలి. దేశం నలు మూలల నుంచి వస్తున్న భక్తుల కోసం దర్గా పరిసర ప్రాంతాల్లో అన్ని ఏర్పాట్లు చేశాం. పారిశుధ్య చర్యలు, విద్యుత్ సౌకర్యం, తాగునీటి సౌకర్యం, భోజనాలు, విడిది తదితర సౌకర్యాలు కల్పించాం. జిల్లా యంత్రాంగం కూడా అన్ని రకాల ఏర్పాట్లు చేస్తోంది.

- పీఠాధిపతులు ఖాద్రీనవీద్ బాబా, ఉబేద్ బాబా

పల్లెల్లో సందడే సందడి

- తొలిరోజు ముమ్మరంగా ప్రజాపాలన గ్రామసభలు
- నాలుగు పథకాల కోసం ప్రజల అర్జీలు
- కొంగాలలో కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతల వాగ్వాదం



ములుగు మండలం జీవంతరావుపల్లి గ్రామసభలో మాట్లాడుతున్న కలెక్టర్

ములుగు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, కొత్త రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక కోసం జిల్లా వ్యాప్తంగా మంగళవారం ప్రజాపాలన గ్రామసభలు ప్రారంభమయాయి. మొత్తం 174 గ్రామ పంచాయతీలకు తొలిరోజు 44 జీపీలలో సభలు జరిగాయి. ములుగు మండలం జీవంతరావుపల్లిలో జరిగిన సభలో జిల్లా కలెక్టర్ దివాకర, వెంకటాపూర్, ఏటూరునాగారం మండలాల్లో జరిగిన సభలలో అదనపు కలెక్టర్లు సంపత్‌రావు, మహేం దర్‌జీ పాల్గొన్నారు. గతంలో ప్రజాపాలన దరఖాస్తుల పేరిట ప్రత్యేక ఫార్మాట్‌లో ప్రభుత్వం ప్రజల నుంచి అర్జీలు స్వీకరించింది. ఇటీవల జరిగిన కులగణన సర్వేలో కుటుంబాల వారీగా ఎన్యుమరేటర్లు సమాచారం సేకరించారు. ఆతర్వాత ఇంటింటి సర్వే చేశారు. వీటి ఆధారంగా నాలుగు పథకాల కోసం లబ్ధిదారులను ఎంపిక చేసి జాబితాను రూపొందించారు. గ్రామ సభలలో లిస్టును చదివిన అధి కారులు ప్రజల అభ్యంతరాలను తెలుసుకున్నారు. ఈక్రమంలో చాలామంది తమకు అన్ని అర్హతలు ఉన్నప్పటికీ ఎంపిక చేయలేదని ఆక్షేపించారు. అయితే లబ్ధిదాల ఎంపిక ప్రక్రియ నిరంతరాయంగా ఉంటుందని, జాబితాలో పేర్లు లేనివారు దరఖాస్తు చేసుకోవాలని అధికారులు కోరారు. దీంతో ప్రజలు పెద్దఎత్తున దరఖాస్తును సమర్పించారు.

44 గ్రామసభలు.. 5961దరఖాస్తులు

ములుగు జిల్లా వ్యాప్తంగా తొలిరోజు 44 గ్రామపంచాయతీలలో ప్రజాపాలన గ్రామసభలు జరిగాయి. నాలుగు పథకాల కోసం 5,961 దరఖాస్తులు వచ్చాయి. కొత్త రేషన్ కార్డుల కోసం 2517, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కోసం 1308, రైతు భరోసా కోసం 134, ఇందిరమ్మ ఇళ్ల కోసం 2,002 దరఖాస్తులు వచ్చాయి. అత్యధికంగా ములుగు మండలంలో 1263 వచ్చాయి. ఎక్కువ మంది ఇందిరమ్మ ఇండ్లు, ఆత్మీయ భరోసా, రేషన్ కార్డుల కోసం అర్జీ పెట్టుకున్నారు.

వాజేడు మండలంలో వాగ్వాదం

వాజేడు మండలం కొంగాల గ్రామపంచాయతీలో జరిగిన సభలో కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు వాగ్వాదానికి దిగారు. మేనిఫెస్టో హామీలను అమలు చేయకుండా ప్రజాపాలన దరఖాస్తుల పేరుతో ప్రజలను మోసం చేస్తున్నారని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పెనుమల్ల రామకృష్ణారెడ్డి అధికారులను నిలదీశారు. మహిళలకు నెలకు రూ.2500, ఎకరానికి రూ. 15వేల రైతు భరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇదే సభలో పాల్గొన్న కాంగ్రెస్ కార్యకర్తలు ఆయనతో గొడవకు దిగారు. దీంతో కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. బందోబస్తు విధుల్లో ఉన్న ఎస్సై రాజ్‌కుమార్ కలగజేసుకొని ఇరువురిని అక్కడి నుంచి పంపించివేశారు. విపక్ష పార్టీలైన బీఆర్ఎస్, బీజేపీ శ్రేణుల నుంచి నిరసనలు వెల్లువెత్తే అవకాశాలున్నాయని గ్రహించిన పోలీసులు గ్రామసభలు జరిగిన అన్ని చోట్లా బందోబస్తు ఏర్పాటు చేశారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి : కలెక్టర్

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ ఫలాలను అర్హులైన ప్రజలు సద్వినియోగం చేసుకో వాలని కలెక్టర్ టీఎస్.దివాకర అన్నారు. ములుగు మండలంలోని జీవంతరావుపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన ప్రజాపాలన గ్రామసభలో ఆయన జిల్లా గ్రంథాలయసంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్‌తో కలిసి పాల్గొన్నారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 26 నుంచి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రైతుభరోసా, ఇందిరమ్మ ఇళ్ల, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయభరోసా పథకాలు అమలు చేయనుందని అన్నారు. ఇప్పటికే పలు పథకాలను అమలు చేస్తున్న ప్రభుత్వం మరో నాలుగు పథకాలను అర్హులకు అందించడానికి జిల్లావ్యాప్తంగా ఈనెల 21 నుంచి 24 వరకు గ్రామసభలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఈపథకాల కింద అర్హులను గుర్తించేందుకు వీలుగా క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించామని, గ్రామసభల్లో సంబంధిత అధికారులు నిజమైన అర్హులను గుర్తించడానికి ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని సూచించారు. గ్రామసభల అనంతరం ఎంపిక చేసిన అర్హులపై ఎలాంటి అభ్యంతరాలైనా అధికారులకు తెలియజేయాలని, పూర్తిస్థాయిలో పరిశీలించిన అనంతరమే సంబంధిత పథకాల అర్హులను ప్రకటించడం జరుగుతుందని స్పష్టంచేశారు. సాగుభూమిలేని వ్యవసాయ కూలీ కుటుంబాలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద రెండు విడతల్లో సాలీనా రూ.12 వేలు అందించడం జరుగుతుందని, ఎలాంటి సాగుభూమి లేకుండా 2023-2024 ఆర్థిక సంవత్సరంలో కనీసం 20 రోజులు ఉపాధిహామీ పథకంలో పనులు చేసిన కుటుంబాలను అర్హులుగా గుర్తించామని అన్నారు. కొత్త రేషన్‌కార్డుల కోసం వచ్చిన దరఖాస్తులను సమగ్ర పరిశీలన జరిపి ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా అర్హులను నిర్ధారించామని తెలిపారు. ఆయా పథకాల కింద ఇప్పటివరకు దరఖాస్తు చేసుకోనివారితోపాటు అర్హత కలిగి లబ్ధిదారుల జాబితాలో పేర్లులేని వారి నుంచి కూడా అర్జీలు స్వీకరించామని అన్నారు. రేషన్‌కార్డుల జారీ, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, తదితర పథకాల కోసం అర్హత కలిగినవారు ఎప్పుడైనా దరఖాస్తు చేసుకోవచ్చని, వాటిని సమగ్రంగా పరిశీలించి అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూర్చడం జరుగుతుందని అన్నారు. ఈవిషయంలో ప్రజలు ఎలాంటి అపోహలు, అనవసర ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదని అన్నారు. వచ్చిన ప్రతి దరఖాస్తుని పరిశీలించి అర్హులకు సంక్షేమ పథకాలు వర్తింపజేస్తామని, అధికారులు నిర్వహిస్తున్న గ్రామసభలకు ప్రజలు సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మండల స్పెషలాఫీసర్ కొమురయ్య, ఎంపీవో రహీం, పంచాయతీ కార్యదర్శి, గ్రామస్థులు పాల్గొన్నారు.



వాజేడు మండలం కొంగాల గ్రామసభలో గొడవ పడుతున్న కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు

రామ్మూర్తిని అరెస్టు చేయాలి : ఎమ్మార్పీఎస్

మంగపేట, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మాదిగ జాతి నాయకుడు మంద కృష్ణమాదిగను అవమానపరిచి ప్రజల మధ్య విద్వేషాలను రెచ్చగొట్టేవిధంగా మాట్లాడిన మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు పసుల రామ్మూర్తిని వెంటనే అరెస్టుచేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుగ్గిళ్ల సురేష్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ కోసం మంద కృష్ణమాదిగ 30 సంవత్సరాలుగా అలుపెరగని పోరాటం చేస్తుంటే రామ్మూర్తి అనే వ్యక్తి కులాల మధ్య రెచ్చగొట్టేవిధంగా మాట్లాడడం సరైందికాదని, అతనిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుండేటి సత్యం, ఎల్వీ.రాజు, రవీందర్, సమ్మయ్య, తరుణ్, సిద్దు తదితరులు పాల్గొన్నారు

ఫిక్స్‌డ్ వేతనం ఇవ్వాలని ఆశాల పాదయాత్ర



పాదయాత్ర నిర్వహిస్తున్న ఆశా కార్యకర్తలు

ములుగు కలెక్టరేట్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఫిక్స్‌డ్ వేతనం రూ.18వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఆశా కార్యకర్తలు మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ములుగు మండలంలోని జంగాలపల్లి నుంచి జిల్లా కేంద్రం వరకు ఐదు కిలోమీటర్లు పాదయాత్ర చేపట్టారు. ఈసందర్భంగా కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం సీఐటీయూ జిల్లా కార్యదర్శి రత్నం రాజేందర్ మాట్లాడుతూ ఆశా కార్యకర్తలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని, ఇళ్లులేని ఆశాలకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని, ఫిక్స్‌డ్ వేతనం నెలకు రూ.18వేల వేతనం అందించాలని, పెండింగ్ పారితోషికాలు అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టరేట్ ఏవో రాజ్‌కుమార్‌కు అందజేశారు.ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు గుండెబోయిన రవిగౌడ్, ఆశా కార్యకర్తలు నీలాదేవి, చుంచు మంజుల, దేవి, సరిత, శాంతకుమారి, సత్యవతి, నాగమణి, రమాదేవి, కవిత, శ్రావ్య, మాధవి, రజిత, చంద్రకళ, పూర్ణ, సౌజన్య, తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌హెచ్‌ఆర్‌సీ అధికార ప్రతినిధిగా కట్టయ్య

ములుగు కలెక్టరేట్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): జాతీయ మానవ హక్కుల కమిటీ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ) జిల్లా అధికార ప్రతినిధిగా ములుగు మండలంలోని జంగాలపల్లి గ్రామానికి చెందిన గొంగళ్ల కట్టయ్య యాదవ్ నియామకమయ్యారు. మంగళవారం ములుగులో జరిగిన కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పెట్టెం రాజు నియామకపత్రం అందజేశారు.

గ్రామసభలో వైద్యశిబిరం

మంగపేట, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చుంచుపల్లిలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన గ్రామసభ జరుగుతుండగా మంగళవారం స్థానిక గిరిజన ఆశ్రమ పాఠశాలలో చుంచుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి యమున ఆధ్వర్యంలో వైద్యశిబిరం జరిగింది. 100 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ వైద్యశిబిరాన్ని ములుగు ఆర్డీవో వెంకటేశ్, మండల అధికారులు పర్యవేక్షించారు.

యువత మత్తుకు బానిస కావొద్దు

గోవిందరావుపేట, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని యువత మత్తుకు బానిస కావొద్దని పస్రా ఎస్సై కమలాకర్ సూచించారు. మండలంలోని పస్రా గ్రామంలోని పలు షాపుల్లో మంగళవారం పోలీసులు నార్కోటిక్ స్నైపర్ డాగ్‌తో తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్సై మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్, పేలుడు పదార్థాలను పసిగట్టడంలో స్నైపర్ డాగ్ పనిచేస్తుందని, గ్రామీణ ప్రాంత యువత మత్తు పదార్థా లకు బానిసై తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సూచిం చారు. ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే సహించేదిలేదని హెచ్చరించారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి : డీఎంహెచ్‌వో



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో గోపాల్‌రావు

మంగపేట, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని డీఎంహెచ్‌వో గోపాల్‌రావు వైద్యులు, సిబ్బందికి సూచించారు. మంగళవారం మండలంలోని మంగపేట, చుంచుపల్లి, బ్రాహ్మణపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలను ఆయన ఐటీడీఏ డిప్యూటీ డీఎంహెచ్‌వో కోరం క్రాంతికుమార్‌తో కలిసి తనిఖీ చేశారు. ఆస్పత్రుల ఆవరణలో మొక్కలు నాటి పరిసరాలను, మందుల నిల్వను పరిశీలించారు. అనంతరం మంగపేటలో జరిగిన సమావేశంలో గోపాల్‌రావు పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ప్రభుత్వ వైద్యులు, సిబ్బంది ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలని సూచించారు. నిర్లక్ష్యవైఖరి ప్రదర్శిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవాలు చేసుకునేలా గర్భిణులకు అవగాహన కల్పించాలన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా క్షయవ్యాధి ప్రోగ్రాం ఆఫీసర్ చంద్రకాంత్, ఐటీడీఏ ప్రోగ్రాం మేనేజర్ మహేందర్, మంగపేట, చుంచుపల్లి, బ్రాహ్మణపల్లి వైద్యాధికారులు గౌతమ్, యమున, నిఖిల్ కుమార్, పల్లె దవాఖాన వైద్యులు మనోజ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి : సీపీఎం

వెంకటాపురం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): రహదారి పనులపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న రోడ్డు కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి బీరెడ్డి సాంబశివ డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వాజేడు మండలం జగన్నాథపురం వైజంక్షన్ నుంచి వెంకటాపురం మండలం ఎదిర గ్రామం వరకు రోడ్డు మరమ్మతుకు ప్రభుత్వం రూ.44 కోట్లను మంజూరు చేసిందని అన్నారు. అయితే కాంట్రాక్టర్ పనులు చేపట్టడంలో బాధ్యతారాహిత్యంగా వ్యవహ రిస్తున్నారని, దీంతో ప్రయాణికులు, వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు సదరు కాంట్రాక్టర్‌తో పనులు చేయించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈసమావేశంలో నాయకులు కట్ల చారి, గ్యానం వాసు, రాంబాబు, నాగేశ్వర్‌రావు, రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శనగర్ కాలనీలో శ్రమదానం

కాటారం, జనవరి 21(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన కాటారం గ్రామపంచాయతీ పరిధిలోని ఆదర్శనగర్ కాలనీలో మంగళవారం మాజీ ఎంపీపీ పంతకాని సమ్మయ్య ఆధ్వర్యంలో పలువురు కాలనీవాసులు శ్రమదానం చేశారు. తుమ్మ చెట్లు, ముళ్ల పొదలను కాలనీవాసులు తొలగించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే దోమలను నివారించవచ్చని మాజీ ఎంపీపీ సమ్మయ్య ఈ సందర్భంగా అన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అభివృద్ధి కమిటీ కన్వీనర్ ఆత్మకూరి కుమార్, మహేష్, కొమురయ్య, రాంనారాయణ, మధు తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పుట్ట మధు పరామర్శ

కాటారం, జనవరి 21(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు మండల కేంద్రంలో మంగళవారం పర్యటించారు. లాయర్ పులి వసుందర్ తండ్రి పులి బొందయ్య ఇటీవల మృతి చెందగా ఆ కుటుంబాన్ని మధు పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలిపారు. గారెపల్లిలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన వారి కుటుంబాలను పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల ఇన్‌చార్జి జోడు శ్రీనివాస్, యూత్ మండల అధ్యక్షుడు రామిళ్ల కిరణ్, బీఆర్ఎస్ జిల్లా నేత జక్కు రాకేష్, నాయకులు మందల లక్ష్మారెడ్డి, గాలి సడవలి, జక్కు శ్రావణ్, చీమల వంశీ, వెంకటేశ్వర్‌రావు, శ్రీశైలం, మానెం రాజబాపు తదితరులు పాల్గొన్నారు.

ఎల్టా ఆధ్వర్యంలో జిల్లా స్థాయి పోటీలు



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎల్టా నాయకులు

భూపాలపల్లిటౌన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ (ఎల్టా) ఆధ్వర్యంలో ఇంగ్లీష్ ఒలంపియాడ్ వకృత్వ పోటీలు మంగళవారం జరిగాయి. భూపాలపల్లి పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన శ్రావణి (జడ్పీహెచ్‌ఎస్-పెద్దాపూర్), హితోక్తి జడ్పీహెచ్‌ఎస్- మొగుళ్లపల్లి), హరిణి, పవన్‌కుమార్ (జడ్పీహెచ్‌ఎస్-భూపాలపల్లి), హర్షవర్థిని (సింగరేణి పాఠశాల), అస్మిత (జడ్పీహెచ్‌ఎస్-మహ దేవపూర్), అక్షయ (టీజీఎంఎస్-గణపురం), హిందుశ్రీ ఎంజేపీ తదితరులు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో డీసీఈబీ కార్యదర్శి చంద్రశేఖర్, హెచ్‌ఎం లక్ష్మిప్రసన్న ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులకు బహుమతులు అందిం చారు. ఎల్టా జిల్లా అధ్యక్షుడు బాలశౌరెడ్డి, ప్రధాన కార్యదర్శి గిరిధర్, కోశాధికారి వీరన్న, రాష్ట్ర కార్యదర్శి నవనీత్, వివిధ పాఠశాలల ఇంగ్లిష్ టీచర్లు పాల్గొన్నారు.

డీఎస్‌పీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా రమేష్



మొగుళ్లపల్లి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ధర్మసమాజ్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా మండలంలోని పెద్దకోమటిపల్లి గ్రామానికి చెందిన మంద రమే ష్‌ను నియమిస్తూ రీజినల్ ఇన్‌చార్జి మేకల సుమన్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. గత పదేళ్లుగా పార్టీలో పనిచేస్తున్న రమేష్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎంపిక కావడం అభినందనీయమని అన్నారు.

టీపీసీసీ ఉపాధ్యక్షురాలు సుగుణకు సన్మానం



సుగుణను సన్మానిస్తున్న మహిళలు, నాయకులు

కాటారం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): టీపీసీసీ ఉపాధ్యక్షురాలుగా నియమితులైన ఆంగోత్ సుగుణకు పలు గ్రామాలకు చెందిన మహిళా సంఘాల ప్రతినిధులు, పలువురు కాంగ్రెస్ నాయకులు మంగళవారం సన్మానించారు. మండల కేంద్రంలోని సొంతింట్లో సుగుణను కాటారం, గారెపల్లి, అంకుసాపూర్, గంగారం, తదితర గ్రామాలకు చెందిన మహిళా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, స్వశక్తి సంఘాల సభ్యులు శాలువాలతో సత్కరించి స్వీట్లు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుజాత, జిల్లా, మండల నాయకులు రమాదేవి, లక్ష్మి, రజిత, సుశీల, కళ, మధునమ్మ, సమ్మక్క తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు అన్యాయం కానివ్వం : ఎమ్మెల్యే గండ్ర



సుల్తాన్‌పూర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర

రేగొండ, జనవరి 21(ఆంధ్రజ్యోతి) : అర్హులైన వారికి సంక్షేమ పథకాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అన్యాయం చేయదని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. కొత్తపల్లిగోరి మండలంలోని సుల్తాన్‌పూర్ గ్రామంలో జరిగిన గ్రామ సభలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, కలెక్టర్ రాహుల్‌శర్మతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతుభరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఆహార భద్రతా కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా వంటి పథకాల లబ్ధిదారులను పారదర్శకంగా ఎంపిక చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ గూటోజు కిష్టన్న, పీఏసీఎస్ చైర్మన్ విజ్ఞన్‌రావు, ఎంపీడీవో వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్ అంబాల చందు, నాయకులు కాశెట్టి రాజయ్య, కానుగుల తిరుపతి, బండి సాయిలు, ఓంప్రకాశ్, మటిక సంతోష్, అమ్ముల రాజన్న, పాతుపల్లి సంతోష్, ప్రభాకర్, మైస భిక్షపతి, వావిలాల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గౌడ కులస్థులు ప్రమాదాల బారిన పడకుండా చర్యలు

భూపాలపల్లి కృష్ణకాలనీ (ఆంధ్రజ్యోతి): గౌడ కులస్థులు ప్రమాదాల బారిన పడకుండా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. భూపాలపల్లి మండలంలోని కొత్తపల్లి ఎస్ఎం గ్రామ శివారులోని సోలిపేట తాటి వనంలో గౌడ కులస్థులకు ప్రభుత్వం అందిస్తున్న కాటమయ్యరక్షణ కవచాలను ఎమ్మెల్యే అందించారు. నియోజకవర్గంలోని సుమారు 83 మందికి ఈ కిట్లను అందజేశారు. అనంతరం కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ గీత కార్మికులు చాలా మంది వృత్తిలో భాగంగా తాటి చెట్టు ఎక్కుతున్న క్రమంలో మోకుజారి కిందపడిపోతున్నారన్నారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ఎనిమిది రకాల పరికరాల కిట్లను అందిస్తోందన్నారు. ఈ అవకాశాన్ని గౌడ కులస్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ వేముల శ్రీనివాస్, జిల్లా ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, గౌడకులస్థులు పాల్గొన్నారు.

మహిళల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

గణపురం (ఆంధ్రజ్యోతి): మహిళల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండల కేంద్రంలో స్వర్ణభారతి మహిళా సమాఖ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎన్నో ఏళ్లుగా నిర్మాణానికి నోచుకోని మహిళా సమాఖ్య భవనానికి రూ. 50లక్షల నిధులను కేటాయిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహిళలను కోటీశ్వరులను చేయాలనే ఉద్దేశంతోనే మహిళలకు సోలార్ ప్లాంట్ల నిర్మించనున్నారని, వాటిలో మహిళా సంఘాలకు ప్రాధాన్యం ఇస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు డీఆర్డీవో గోవిందరావు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రాజేందర్, డైరెక్టర్ శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ కుమార్, చోటేమియా, మాజీ జడ్పీటీసీ ముత్యాల రాజయ్య, మాజీ ఎంపీపీ నారాయణ, మాజీ ఎంపీటీసీ శివశంకర్, మాజీ సర్పంచ్ నారగాని దేవేందర్, మల్లికార్జున్, స్వర్ణ భారతి మహిళా అధ్యక్షురాలు విజయ, ఉపాధ్యాక్షురాలు సారలక్ష్మి, కళావతి, రేణుక తదితరులు పాల్గొన్నారు.

మందుల కొరత ఉండొద్దు

భూపాలపల్లి డీఎంహెచ్‌వో మధుసూదన్

భూపాలపల్లి కలెక్టరేట్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో మందుల కొరత లేకుండా అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో మధుసూదన్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో అన్ని పీహెచ్‌సీల ఫార్మసిస్టులు, నర్సింగ్ ఆఫీసర్లతో డీఎంహెచ్‌వో సమావేశమయ్యారు. వార్షిక అవసరాల కోసం పెట్టే మందుల ఇండెంట్లు పారదర్శకంగా ఉండాలన్నారు. ఈ ఔషధి అమలులో నిర్లక్ష్యం చేయకూడదన్నారు. ఫార్మసిస్టులు, నర్సింగ్ అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. మందులు ఎక్స్‌పైరీ కాకుండా ఆస్పత్రులకు సకాలంలో మందులు సరఫరా చేయాలన్నారు. ఈకార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి ఉమాదేవి, ఉమ్మడి జిల్లాల సీడీఎస్ స్టోర్ ఇన్‌చార్జి ఫార్మసిస్టు ఉప్పు భాస్కర్, జిల్లా సీఎంసీ పార్మసి సూపర్‌వైజర్ పద్మజ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ముగ్గురికికి తీవ్ర గాయాలు

కాటారం, జనవరి 21(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రం శివారులో 353(సీ)జాతీయ రహదారిపై మంగళవారం గుర్తు తెలియని లారీ ఢీకొన్న ప్రమాదంలో ధన్వాడ గ్రామా నికి చెందిన తులిసెగారి తిరుపతి, తులిసెగారి చిన్న సమ్మ య్య, దాతు రాజయ్య గాయపడ్డారు. కొత్తపల్లి సమీ పం లోని ఫంక్షన్ హాల్‌లో బంధువుల బర్త్‌డే ఫంక్షన్‌కు హాజ రైన తిరుపతి, సమ్మయ్య, రాజయ్య బైక్‌పై ధన్వా డకు తిరిగి వెళ్తుండగా మండలకేంద్రం శివారులోని వడ్లోని వా గు వద్ద భూపాలపల్లి నుంచి కాటారం వైపు వెళ్తున్న లారీ బైక్‌ను ఢీకొంది. దీంతో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి.

చికిత్స పొందుతూ మృతి

వాజేడు (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న మహిళ మృతిచెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. మండల కేంద్రంలోని జంగాలపల్లికి చెందిన వాసం నాగలక్ష్మి(39) గడిచిన ఆదివారం చత్తీస్‌గఢ్‌లో బంధువుల ఇంట్లో వివాహానికి భర్త నీలాద్రితో కలిసి ద్విచక్ర వాహనంపై వెళ్లింది. తిరిగి వస్తున్న క్రమంలో మండలంలోని చీకుపల్లి వంతెన-గుమ్మడిదొడ్డి గ్రామాల మధ్య ఉన్న మలుపు వద్ద బైక్ గుంతలో పడటంతో వెనుకాల కూర్చున్న నాగలక్ష్మి ప్రమాదవశాత్తు బైక్ మీద నుంచి కిందపడడంతో తలకు తీవ్రమైన గాయమైంది. దీంతో ఆమెను కుటుంబ సభ్యులు వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరించారు. మంగళవారం కుటుంబ సభ్యులు మెరుగైన వైద్యం నిమిత్తం హనుమకొండలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించి చికిత్సను అందిస్తున్న క్రమంలో మృతిచెందింది. మృతు రాలి భర్త జీపీ ఆఫీస్‌లో ట్రాక్టరు డ్రైవరుగా పనిచేస్తుండగా ఆమెకు ఒక కొడుకు, కూతురు ఉన్నారు.

గుడుంబా పట్టివేత

ప్రభుత్వ నిషేదిత 200 లీటర్ల గుడుంబాను వాజేడు పోలీసులు పట్టుకున్నారు. మండలంలోని చెరుకూరులో ఎస్సై రాజ్‌కుమార్‌తో పాటు, పోలీసులు తనిఖీలు నిర్వహిస్తు న్నారు. ఈ క్రమంలో మండలంలోని రేగుల పాడుకు చెందిన కన్నెబోయిన కాటంరాజు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని తార్లగుడ నుంచి అక్రమంగా గుడుంబాను తీసుకువచ్చి ఇంటి వద్ద అమ్ముతుండగా పట్టుకొని కేసు నమోదు చేశారు.

ఓసీలో చోరీకి యత్నం

గణపురం (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి సింగరేణి ఏరియా పరిధిలోని ఓపెన్‌కాస్టు-3లో వరుస దొంగతనాలు జరుగుతున్నాయి. విలువైన కాపర్ వైర్లతో పాటు ట్రాన్స్‌మిషన్‌లు మాయమవుతున్నాయి. ఈ క్రమంలోనే మంగళవారం తెల్లవారుజామున ఓపెన్‌కాస్టు -3 డంప్ యార్డు సమీపంలో ఓ దొంగల ముఠా కాపర్ వైర్ కట్ చేస్తుండగా అక్కడ విధుల్లో ఉన్న సెక్యూరిటీ గార్డు గమనించి ఘటనా స్థలికి వెళ్లే సరికి నలుగురు అక్కడ నుంచి తప్పించుకోగా ఒక్కరిని మాత్రం అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. నిందితుడుని గణపురం పోలీస్ స్టేషన్‌లో అప్పగించారని తెలుస్తోంది.

ఆగిఉన్న టిప్పర్‌ని ఢీకొన్న కారు

ఆగి ఉన్న బొగ్గు ట్రక్కును కారు ఢీ కొన్న ఘటన మండలంలోని చెల్పూరులో హెచ్‌పీ పెట్రోల్ బంక్ ఎదురుగా జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. భూపాలపల్లి సింగరేణి నుంచి బొగ్గు లోడ్‌తో పరకాల వైపు వెళ్తున్న టిప్పర్ హెచ్‌పీ పెట్రోల్ బంక్ ఎదురుగా ఆపాడు. ఎదురుగా పరకాల వైపు నుంచి వస్తూ భూపాలపల్లికి వెళ్తున్న తున్న కారు అదుపుతప్పి టిప్పర్‌ను ఢీ కొట్టింది. కారులో ప్రయాణిస్తున్న ములుగు జిల్లా మేడారం గ్రామానికి చెందిన గండికోట అఖిల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని భూపాలపల్లిలోని వంద పడకల ఆస్పత్రికి తరలించి అక్కడ నుంచి మెరుగైన వైద్యం కొసం వరంగల్‌కు తీసుకెళ్లారని తెలిసింది.

వానరాన్ని తప్పించబోయి...

తాడ్వాయి (ఆంధ్రజ్యోతి): వానరాన్ని తప్పించబోయి చెట్టును ఓ కారు ఢీకొన్న ఘటన తాడ్వాయి- పస్రా జాతీయ రహదారిపై మంగళవారం చోటు చేసుకుంది. ఆదిలాబాద్ జిల్లాకు చెందిన ఇరిగేషన్ డీఈ శ్రీనివాస్ తన కుటుంబ సభ్యులతో కలిసి భద్రాచలం దైవ దర్శనానికి వెళ్లి వస్తుండగా తాడ్వాయి శివారులో రోడ్డుపై ఉన్న వానరాన్ని తప్పించబోయారు. ఈ క్రమంలో కారు అదుపు తప్పడంతో చెట్టుకు ఢీకొనగా శ్రీనివాస్‌తో పాటు మరో ముగ్గురు కుటుంబ సభ్యులకు గాయాలయ్యాయి. అదే సమయంలో అటువైపుగా వెళ్తున్న జిల్లా పౌరసరాఫాల శాఖ మేనేజర్ క్షతగాత్రులను తన వాహనంలో ఆస్పత్రికి తరలించారు.

బాధిత కుటుంబాలను పరామర్శించిన సిరికొండ



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న మధుసూదనాచారి

చిట్యాల, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన బాధిత కుటుంబ సభ్యులను రాష్ట్ర శాసనమండలి ప్రతిపక్షనేత, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి మంగళవారం పరామర్శించారు. మండల కేంద్రంలో బీఆర్ఎస్ టౌన్ అధ్యక్షుడు బుర్ర శ్రీధర్, ముసాపూరి రమేష్, తిరుమలపూరంలో నీరటి భద్రయ్య, చల్లగరిగలో మేదరి వీరస్వామిని పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు చింతల రమేష్, పువ్వాటి హరికృష్ణ, బాలకృష్ణ, సంతోష్, వేణువంక శ్రీదేవీ, శ్రీకాంత్, రాజిరెడ్డి, సదానందం, భిక్షపతి, రంజిత్, రజిత, గంగా తదితరులు పాల్గొన్నారు.